thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

భారత్ అఫ్గాన్ షెడ్యూల్ విడుదల



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 143| జగిత్యాల | బుధవారం 26 ఆగస్టు, 2026 ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## అమెరికా చదువులపై విద్యార్థుల్లో అనాసక్తి



4

- ఉద్యోగార్థుల్లోనూ పెరుగుతున్న నిరాశ
- ఆంక్షలతో విసుగెత్తుతున్న భారతీయులు
- చదువుల కోసం వెళ్లేవారి సంఖ్య తగ్గుదల

## తెలంగాణ మోడల్‌లో కులగణన

- జనగణనలో కులగణన విధానం సరిగా లేదు
- ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు
- ప్రధాని మోడీకి రాహుల్, ఖర్గేల లేఖ



4

## భవిష్యత్ తరానికి బాధ్యతలు అప్పగించాలి



4

- గడ్కరీ వ్యాఖ్యలతో రాజకీయ కలకలం
- కేంద్రంలో కొత్త తరానికి అవకాశం ?



# మూసీ భూసేకరణ వేగవంతం చేయండి

### ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలి

- రెండో దశ పనులకు టెండర్లు పిలవాలి
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూములపై విధివిధానాలు ఖరారు చేయాలి
- న్యాయపరమైన చిక్కులు లేకుండా చూడాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం లేకుండా ల్యాండ్ పూలింగ్ విధానంపై స్పష్ట మైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో సీఎం ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్ ఫేజ్-2 పనులకు వీలైనంత త్వరగా టెండర్లు పిలవాలని అధికారులకు స్పష్టం చేశారు. భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత ఉండేలా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ మరియు అసైన్డ్ భూముల సేకరణకు సంబంధించి పక్కా విధివిధానాలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

2

- చురకలు హైదరాబాద్, ఆగస్టు 25



## ఫాస్టాగ్ నుంచే ట్రాఫిక్ చలాన్లు!

- కొత్త విధానంపై హైదరాబాద్ పోలీసుల యోచన
- జరిమానాను నేరుగా ఫాస్టాగ్ ఖాతా నుంచి వసూలు చేసే ప్రతిపాదన
- హెచ్‌ఎండీఏ అధికారులతో చర్చలు.. స్పందన కోసం ఎదురుచూపు
- సాంకేతికతతో ట్రాఫిక్ నిబంధనల అమలు మరింత పటిష్ఠం
- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్ వెల్లడి

2

# కొండా సురేఖ, చిన్నారెడ్డి ఔట్?

- ఇద్దరిపైనా కఠిన చర్యలకు క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు నివేదిక అందించిన మల్లు రవి
- పార్టీ గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఉపేక్షించొద్దని సూచన
- కేంద్ర నాయకత్వానికి చేరిన నివేదిక.. అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ
- 'పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు'.. మల్లు రవి స్పష్టీకరణ



తెలంగాణ కాంగ్రెస్‌లో ఇద్దరు సీనియర్ నేతలపై వేటు పడనుందా? మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తమ పదవులు కోల్పోనున్నారా? ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో ఇదే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇద్దరు నేతల వ్యవహారంపై విచారణ జరిపిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ తన నివేదికను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేయడంతో తదుపరి చర్యలపై చర్చ మొదలైంది. క్రమశిక్షణ ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ ఇద్దరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

2

- చురకలు హైదరాబాద్, ఆగస్టు 25

## యూరియా మోత.. నేల ఆరోగ్యానికి ముప్పు



- ఎరువుల ధరల్లో అసమతుల్యతపై మంత్రి తుమ్మల ఆందోళన

.. వివరాలు 2లో

ఎరువుల ధరల్లో ఉన్న తీవ్ర వ్యత్యాసం కారణంగా రైతులు తక్కువ ధరకు లభించే యూరియా వైపు మొగ్గుచూపుతున్నారని, దీనివల్ల పంటలకు సమతుల్య పోషకాలు అందక నేల ఆరోగ్యం క్షీణిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు.

## అక్రమ పాన్ మసాలా తయారీ

- గుట్టు రట్టు చేసిన జీఎస్టీ అధికారులు
- పాన్ మసాలాలతో 160 కోట్ల జీఎస్టీ ఎగవేత
- కీలక నిందితుడిని అరెస్ట్ చేసిన అధికారులు

2



హైదరాబాద్ నగర శివార్లలో ఓ షెడ్‌లో అక్రమ పాన్‌మసాలా, పొగాకు తయారీ కేంద్రం గుట్టును సెంట్రల్ జీఎస్టీ అధికారులు రట్టు చేశారు. కీలక వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడిని హైదరాబాద్ ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు.



## మీ పోరాటానికి నా సెల్యూట్

- కేంద్ర ప్రభుత్వాన్నే గడగడలాడించింది ఈ తరం జెన్ జీ
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

3

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

- వర్షాలు, వరదల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి
- ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన
- నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం

3



వర్షాలు, వరదలతో పాటు సీజనల్ వ్యాధులపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా అన్ని శాఖలను సిద్ధంగా ద ఉంచాలని సూచించారు.



## అమెరికా పర్యటనపై రేవంత్ క్లారిటీ ఇవ్వాలి

- రాజకీయ కారణాలంటూ ఆరోపించడం అర్థరహితం
- మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో ప్రజలకు చెప్పాలి
- నిబంధనల ప్రకారమే విదేశాంగ శాఖ నిర్ణయాలు
- గతంలో నా విదేశీ పర్యటనకూ అనుమతి నిరాకరించారు
- గుజరాత్ సీఎంతో పోల్చడం వితండవాదం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

3

చురకలు






# ఫాస్టాగ్ నుంచే ట్రాఫిక్ చలాన్లు!

## కొత్త విధానంపై హైదరాబాద్ పోలీసుల యోచన

### జరిమానా ఫాస్టాగ్ ఖాతా నుంచి వసూలు చేసే ప్రతిపాదన

### హెచ్ఎండీఏ అధికారులతో చర్చలు.. స్పందన కోసం ఎదురుచూపు

### సాంకేతికతతో ట్రాఫిక్ నిబంధనల అమలు మరింత పటిష్ఠం

### సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ సున్‌ప్రీత్ సింగ్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 25:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చలాన్ కట్టకుండా తప్పించుకోవడం ఇక కష్టమేనా? పెండింగ్ చలాన్ల వసూలుకు ఫాస్టాగ్‌ను అస్త్రంగా మార్చేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారా? వాహనదారుల ఫాస్టాగ్ ఖాతాల నుంచే ట్రాఫిక్ జరిమానాలను నేరుగా వసూలు చేసే వినూత్న విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చే అంశాన్ని హైదరాబాద్ పోలీసులు పరిశీలిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు విధించే జరిమానాలను వారి ఫాస్టాగ్ ఖాతాల నుంచి నేరుగా వసూలు చేసే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. ఈ విధానం అమలుకు సంబంధించి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో చర్చిస్తున్నామని, వారి నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉందని తెలిపారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ 20వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సున్‌ప్రీత్ సింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'ప్రజలు, భాగస్వామ్యం, సాంకేతికత ద్వారా సురక్షితమైన రహదారుల నిర్మాణం' అనే అంశంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకొని ట్రాఫిక్ నిబంధనల అమలును మరింత పటిష్ఠం చేయడమే ఈ ప్రతిపాదన ఉద్దేశమని తెలిపారు. కేవలం జరిమానాలు విధించడంతోనే వాహనదారుల ప్రవర్తనలో శాశ్వత మార్పు వస్తుందని భావించలేమని, బాధ్యతాయుతమైన వాహన చోదనను ప్రోత్సహించడంలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గత రెండు దశాబ్దాల్లో హైదరాబాద్ వేగంగా విస్తరించడంతో వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీతోపాటు ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు కూడా పెరిగాయని సున్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. రహదారి భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రభుత్వ సంస్థలతోపాటు వాహనదారులు, ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థ, చివరి మజిలీ వరకు రవాణా అనుసంధానం, బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయాలను పెంచడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. ప్రభుత్వ విభాగాలు, పోలీసులు, సాంకేతిక సంస్థలు, పౌరుల మధ్య సమన్వయం పెరిగితేనే రహదారి భద్రతలో ఆశించిన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. అయితే ఫాస్టాగ్ నుంచి చలాన్లను నేరుగా వసూలు చేసే విధానం ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉందని, ఇంకా అమల్లోకి రాలేదన్న విషయాన్ని అధికారులు స్పష్టం చేశారు.

# అక్రమ పాన్ మాసాల తయారీ

## గుట్టు రట్టు చేసిన జీఎస్టీ అధికారులు

### పాన్ మసాలాలతో 160 కోట్ల జీఎస్టీ ఎగవేత

### కీలక నిదితుడిని అరెస్ట్ చేసిన అధికారులు

**హైదరాబాద్, ఆగస్ట్ 25:** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో అక్రమ పాన్‌మసాలా, పొగాకు తయారీ కేంద్రం గుట్టును సెంట్రల్ జీఎస్టీ అధికారులు రట్టు చేశారు. హైదరాబాద్ నగర శివార్లలో ఓ షెడ్‌లో రహస్యంగా వీటిని అక్రమంగా తయారీ చేస్తున్నట్లు వారికి సమాచారం అందింది. ఈ సందర్భంగా కీలక వ్యక్తిని అరెస్ట్ చేశారు. నిందితుడిని హైదరాబాద్ ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో హాజరు పరిచారు. అతడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీని కోర్టు విధించింది. ఆగస్టు 20వ తేదీన ఈ కేంద్రంపై సీజీఎస్టీ అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు 5,500 కిలోల ప్యాక్ చేసిన పాన్ మసాలా, పొగాకు నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 76 లక్షల విలువైన సరుకును సీజ్ చేశారు. ఈ దాడుల్లో 2,015 కిలోల పాన్ మసాలా మిశ్రమంతోపాటు 810 కిలోల పొగాకు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా 40 ఎఫ్ఎఫ్ఎస్ ప్యాకింగ్ యంత్రాలను సీజ్ చేశారు. కేంద్రంలో 56 మంది కార్మికుల పని చేస్తున్నట్లు గుర్తించారు. పలు బ్రాండ్లతో పాటు పేరు లేని పాన్ మసాలా, జర్దాను తయారీ చేస్తున్నట్లు సీజీఎస్టీ అధికారులు కనుగొన్నారు. ఈ అక్రమ ఉత్పత్తుల రవాణాకు వినియోగిస్తున్న రెండు వాహనాలు సీజ్ చేశారు. భారీగా ప్యాకింగ్ మెటీరియల్‌తోపాటు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక జీఎస్టీ, హెచ్ఎస్ఎన్ఎస్ సెస్, కేంద్ర ఎక్సైజ్ సుంకం చెల్లించకుండా ఈ ఉత్పత్తుల విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు పన్ను, సెస్ ఎగవేత విలువ సుమారు రూ.160 కోట్లుగా గుర్తించామని వివరించారు. యంత్రాల సంఖ్య, సామర్థ్యం, నిల్వలు, సిబ్బంది వివరాల ఆధారంగా పన్ను ఎగవేత అంచనా వేసినట్లు సీజీఎస్టీ అధికారులు తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లేకుండానే ఈ పాన్‌మసాలా, పొగాకు ఉత్పత్తులను నిందితులు తయారీ చేస్తున్నారని సీజీఎస్టీ అధికారులు చెప్పారు.



# మూసీ భూసేకరణ వేగవంతం చేయండి

- ల్యాండ్ పూలింగ్‌పై స్పష్టమైన విధానం రూపొందించాలి
- రెండో దశ పనులకు త్వరగా టెండర్లు పిలవాలి
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూములపై విధివిధానాలు ఖరారు చేయాలి
- న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్, ఆగస్టు 25:** ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంతోపాటు ల్యాండ్ పూలింగ్ విషయంలో స్పష్టమైన విధానాన్ని రూపొందించాలని సూచించారు. భూసేకరణలో భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా అన్ని అంశాలను ముందుగానే పరిశీలించి పకడ్బందీగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులు, తదుపరి దశలో అమలు చేయాల్సిన కార్యక్రమాలు, భూసేకరణ, నిధుల సమీకరణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు రెండో దశకు వీలైనంత త్వరగా టెండర్లు పిలిచి పనులు ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. భూసేకరణలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూములకు సంబంధించి ప్రత్యేకంగా స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని సీఎం సూచించారు. ఆయా భూముల స్వభావం, యాజమాన్య హక్కులు, చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ముందుకు వెళ్లాలని చెప్పారు. ల్యాండ్ పూలింగ్ విధానంపైనా స్పష్టత తీసుకురావాలని, భవిష్యత్తులో కోర్టు వివాదాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మూసీ రివర్‌ఫ్రంట్‌లో భాగంగా చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన నిధుల సమీకరణపైనా ముఖ్యమంత్రి దృష్టి సారించారు. అతి తక్కువ వడ్డీతో రుణ సదుపాయాలు పొందే అవకాశాలను పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించిన బదిలీ అభివృద్ధి హక్కుల జారీ ప్రక్రియను కూడా ప్రతి వారం సమీక్షిస్తూ పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. గండిపేట మంచిరేవుల సమీపంలో నిర్మించనున్న ఓంకారేశ్వరస్వామి ఆలయ పనులకు తక్షణమే టెండర్లు పిలవాలని సీఎం ఆదేశించారు. కొత్వాల్‌గూడ బర్డ్స్ పార్క్‌కు విస్తృత ప్రచారం కల్పించి ప్రజలను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మూసీ పునరుజ్జీవంతోపాటు దాని పరిసర ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# కొండా సురేఖ, చిన్నారెడ్డి ఔట్?

- ఇద్దరిపైనా కఠిన చర్యలకు క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు నివేదిక అందించిన మల్లు రవి
- పార్టీ గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఉపేక్షించొద్దని సూచన
- కేంద్ర నాయకత్వానికి చేరిన నివేదిక.. అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ
- 'పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు'.. మల్లు రవి స్పష్టీకరణ



**హైదరాబాద్, ఆగస్టు 25:** తెలంగాణ కాంగ్రెస్‌లో ఇద్దరు సీనియర్ నేతలపై వేటు పడనుందా? మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి తమ పదవులు కోల్పోనున్నారా? ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో ఇదే అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇద్దరు నేతల వ్యవహారంపై విచారణ జరిపిన పీసీసీ క్రమశిక్షణ కమిటీ తన నివేదికను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేయడంతో తదుపరి చర్యలపై చర్చ మొదలైంది. క్రమశిక్షణ ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ ఇద్దరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి, వైస్ చైర్మన్ శ్యామ్ మోహన్ కలిసి నివేదికను మహేశ్‌కుమార్ గౌడ్‌కు అందజేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలతోపాటు గతంలో చోటుచేసుకున్న పరిణామాలు, మీడియాలో వచ్చిన కథనాలు, పార్టీపై వాటి ప్రభావం తదితర అంశాలను పరిశీలించిన అనంతరం కమిటీ నివేదిక రూపొందించినట్లు మల్లు రవి తెలిపారు.

### సురేఖపై వేటుకు సిఫార్సు?

కొండా సురేఖ కుమార్తె సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యల వ్యవహారం కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపింది. ఆ వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించాల్సిందని క్రమశిక్షణ కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. సీనియర్ నాయకురాలిగా, మంత్రిగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు పార్టీకి ఇబ్బందికరంగా మారాయని కమిటీ భావించినట్లు తెలుస్తోంది. సురేఖ విషయంలో గత పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. పదేపదే వివాదాలు పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠపై ప్రభావం చూపుతున్నాయని, ఇకపై ఉపేక్షిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని కమిటీ భావించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే నివేదికలోని నిర్దిష్ట సిఫార్సులను మల్లు రవి అధికారికంగా వెల్లడించలేదు.

### చిన్నారెడ్డిపైనా కఠిన వైఖరి!

సీనియర్ నేత, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారాన్నీ కమిటీ తీవ్రంగానే పరిగణించినట్లు తెలుస్తోంది. పార్టీలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయన గతంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. అలాంటి సీనియర్ నాయకుడి వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉండకూడదని కమిటీ అభిప్రాయపడినట్లు సమాచారం. ఆయనపై కూడా కఠిన చర్యలకు సిఫార్సు చేసినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.

### 'హద్దులు దాటితే హెచ్చరిక తప్పదు'

నివేదిక సమర్పించిన అనంతరం గాంధీభవన్‌లో మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణలను పరిశీలించిన తర్వాతే సమగ్ర నివేదికను పీసీసీ అధ్యక్షుడికి అందజేశామని తెలిపారు. "కాంగ్రెస్ గౌరవాన్ని దెబ్బతీసే పనులు ఎవరూ చేయకూడదు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగించేలా నాయకులు మాట్లాడకూడదు. అన్ని అంశాలను అధ్యయనం చేశాం. హద్దులు దాటే నేతలకు స్పష్టమైన హెచ్చరిక వెళ్లాల్సిన అవసరం ఉంది. క్రమశిక్షణ చర్యలు కఠినంగా ఉండాలని నివేదిక ఇచ్చాం" అని మల్లు రవి పేర్కొన్నారు. అయితే నివేదికలో ఎవరిపై ఎలాంటి చర్యలు సిఫార్సు చేశారన్న విషయాన్ని ఆయన వెల్లడించలేదు. "నివేదికలో ఏముందో ముందే చెబితే అధిష్ఠానం నుంచి నాకే నోటీసులు వస్తాయి. పార్టీ అంతర్గత వ్యవహారాలను బయటపెట్టకూడదని ప్రధానంగా చెప్పాం" అని వ్యాఖ్యానించారు.

### ఇక బంతి అధిష్ఠానం కోర్టులో!

ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇవ్వలేదని, ఇది పూర్తిగా పార్టీకి సంబంధించిన వ్యవహారం కావడంతో పీసీసీ అధ్యక్షుడికే అందజేశామని మల్లు రవి స్పష్టం చేశారు. నివేదికను రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తోపాటు ఏఐసీసీ నాయకత్వానికి పంపనున్నట్లు తెలిపారు. కేంద్ర నాయకత్వం సమీక్షించిన అనంతరం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగానే తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. క్రమశిక్షణపైనే పార్టీ గౌరవం ఆధారపడి ఉంటుందని, ఆ గౌరవాన్ని కాపాడుకుంటేనే మళ్లీ ప్రజల విశ్వాసాన్ని పొందగలమని మల్లు రవి పేర్కొన్నారు. పార్టీపై ప్రతికూల అభిప్రాయం ఏర్పడకుండా అవసరమైన సందర్భాల్లో కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి కాంగ్రెస్ అధిష్ఠానంపైనే పడింది. క్రమశిక్షణ కమిటీ నివేదికను యథాతథంగా ఆమోదించి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలకు దిగుతారా? లేక హెచ్చరికతో సరిపెడతారా? అన్నది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

# యూరియా మోత.. నేల ఆరోగ్యానికి ముప్పు

## ఎరువుల ధరల్లో అసమతుల్యతపై మంత్రి తుమ్మల ఆందోళన



**హైదరాబాద్, ఆగస్టు 25:** ఎరువుల ధరల్లో ఉన్న భారీ వ్యత్యాసం కారణంగా రైతులు తక్కువ ధరకు లభించే యూరియా వైపు అధికంగా మొగ్గుచూపుతున్నారని, దీని వల్ల నేల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు పంటల నాణ్యత కూడా ప్రమాదంలో పడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలను సమతుల్యం చేసేలా కేంద్ర ప్రభుత్వం వెంటనే రేషనలైజేషన్ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల వివరాల ప్రకారం తెలంగాణలో యూరియా వినియోగం గత పదేళ్లలో గణనీయంగా పెరిగింది. 2015-16లో 14 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్న వినియోగం 2025-26 నాటికి 20.70 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్‌పీకే వినియోగ నిష్పత్తి 12.6:4.8:1గా ఉండగా, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన సమతుల్య నిష్పత్తి 4:2:1 మాత్రమేనని మంత్రి తెలిపారు.

### ధరలే రైతులను యూరియా వైపు నెడుతున్నాయి

ప్రస్తుతం 45 కిలోల యూరియా బస్తా రూ.240 నుంచి రూ.266కే లభిస్తుండగా, 50 కిలోల డీఏపీ బస్తా ధర రూ.1,350, 19:9:19 కాంప్లెక్స్ ఎరువుల బస్తా రూ.1,750కు చేరింది. ఈ భారీ ధరల తేడాతో రైతులు పంటలకు అవసరమైన ఇతర పోషకాలను విస్మరించి యూరియాను అధికంగా వినియోగిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.

### నేల సారం తగ్గి.. పంట నాణ్యత దెబ్బ

వరి, మొక్కజొన్న, పత్తి పంటల్లో సిఫారసు చేసిన మోతాదుకంటే అధికంగా యూరియా వినియోగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ గుర్తించిందని మంత్రి వెల్లడించారు. మొక్కజొన్నలో మూడు బస్తాల బదులుగా ఐదు నుంచి పది బస్తాల వరకు యూరియా వేస్తున్నారని తెలిపారు. పత్తిలో కూడా నైట్రోజన్ వినియోగం అధికంగా, పొటాష్ వినియోగం తక్కువగా ఉందన్నారు. ఈ అసమతుల్య వినియోగంతో నేలలో జింక్, బోరాన్ వంటి సూక్ష్మ పోషకాల లోపం ఏర్పడుతుందని, నైట్రోజన్ లీచింగ్ పెరిగి నేల, భూగర్భ జలాల కాలుష్యానికి దారితీస్తోందని వివరించారు. చీడపీడలు, తెగుళ్లు పెరిగి రైతుల సాగు ఖర్చులు కూడా అధికమవుతున్నాయని చెప్పారు.

### విదేశీ మార్కెట్లలో గిరాకీ తగ్గే ప్రమాదం

అధిక యూరియా వినియోగం వల్ల పంటల నాణ్యత తగ్గే ప్రమాదం ఉందని, దీని ప్రభావం అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తుల గిరాకీపైనా పడుతోందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన ఉత్పత్తులను ఎగుమతి చేయాలంటే సమతుల్య ఎరువుల వినియోగం తప్పనిసరి అని అన్నారు.

### కేంద్రాన్ని పలుమార్లు కోరినా స్పందన లేదు

ఎరువుల ధరలను సమతుల్యం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు కోరినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించడం లేదని మంత్రి తుమ్మల విమర్శించారు. యూరియా వినియోగాన్ని తగ్గించమని రైతులకు చెప్పడం మాత్రమే సరిపోదని, ఇతర ఎరువులు కూడా రైతులకు అందుబాటు ధరల్లో లభించేలా ధరల విధానంలో మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరారు.

### రైతులకు సమతుల్య ఎరువులపై అవగాహన

రైతులు శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులోనే ఎరువులు వినియోగించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు, వర్మీకంపోస్ట్, బయోఫెర్టిలైజర్లు వంటి ప్రత్యామ్నాయ పోషక వనరులను వినియోగించాలని సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగాన్ని కూడా ప్రోత్సహించాలని చెప్పారు.

### 'రైతునేస్తం'తో ప్రచారం.. ఎఫ్ఎఫ్ఎస్ యాప్ విస్తరణ

మంత్రి ఆదేశాల మేరకు 'రైతునేస్తం' కార్యక్రమం ద్వారా యూరియా అధిక వినియోగం వల్ల కలిగే అనర్థాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. ఎరువుల సమతుల్య వినియోగం, నానో యూరియా వినియోగం తదితర అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు అందిస్తున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల విక్రయాల యాప్ ప్రస్తుతం రాష్ట్రంలోని 22 జిల్లాల్లో అమల్లో ఉందని, మిగిలిన జిల్లాల్లో కూడా ఈ నెల 27 నుంచి సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. యాప్ వినియోగంపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

చురకలు





# అమెరికా పర్యటనపై రేవంత్ క్లారిటీ ఇవ్వాలి

- రాజకీయ కారణాలంటూ ఆరోపించడం అర్థరహితం
- మమ్దానీని ఎందుకు కలవాలనుకున్నారో ప్రజలకు చెప్పాలి
- నిబంధనల ప్రకారమే విదేశాంగ శాఖ నిర్ణయాలు
- గతంలో నా విదేశీ పర్యటనకూ అనుమతి నిరాకరించారు
- గుజరాత్ సీఎంతో పోల్చడం వితండవాదం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అమెరికా పర్యటన ఉద్దేశమేమిటో తెలంగాణ ప్రజలకు స్పష్టంగా వివరించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించిందంటూ రేవంత్ చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనల విషయంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎలాంటి నిబంధనలు తీసుకురాలేదని, గతం నుంచి అమల్లో ఉన్న విధివిధానాల ప్రకారమే విదేశాంగ శాఖ నిర్ణయాలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీలో మంగళవారం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రేవంత్ వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. అవసరమైన అనుమతులు రాకముందే విదేశీ పర్యటనకు ఎందుకు వెళ్లారో ముఖ్యమంత్రి చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థాయికి తగిన విధంగా పర్యటన ఉండాలని, విదేశీ పర్యటనలకు అనుమతుల విషయంలో రాజకీయాలకు తావులేదని పేర్కొన్నారు.

### మమ్దానీతో భేటీ ఎందుకు?

న్యూయార్క్ మేయర్ మమ్దానీని రేవంత్ రెడ్డి కలవనున్నట్లు వార్తలు వచ్చాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయనతో భేటీ కావాల్సిన అవసరం ఏమిటో ముఖ్యమంత్రి ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీపై మమ్దానీ గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ, అలాంటి వ్యక్తితో సమావేశం వెనుక ఉద్దేశం ఏమిటో స్పష్టం చేయాలన్నారు.

### నా పర్యటనకూ అనుమతి రాలేదు

గతంలో తన విదేశీ పర్యటనకు కూడా కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించిన సందర్భం ఉందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విదేశాంగ శాఖ నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రికి అమెరికా పర్యటనకు అనుమతిచ్చి తనకు ఇవ్వలేదని రేవంత్ వాదించడం సరికాదన్నారు. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనకు అనుమతి నిరాకరించిందని గుర్తుచేశారు. అదే సమయంలో రేవంత్ రెడ్డి హార్వర్డ్ బిజినెస్ కోర్సుకు వెళ్లేందుకు కేంద్రం అనుమతించిందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలకు అనుమతులు నిరాకరించిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు.

### కులగణనలో ప్రభుత్వం విఫలం

తెలంగాణలో చేపట్టిన కులగణనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని కిషన్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో దాదాపు 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని పేర్కొన్నారు. కులగణన అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి సరైన అవగాహన లేదని విమర్శించారు.

# మీ పోరాటానికి నా సెల్యూట్..

- కేంద్ర ప్రభుత్వాన్నే గడగడలాడించింది జెన్ జీ
- జెన్ జీని తక్కువ అంచనా వేయొద్దు!
- లక్ష మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?
- జీవో 97 రద్దు చేసే వరకు పోరాటం ఆగదు
- సెప్టెంబర్ 7లోగా నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు




**హైదరాబాద్, ఆగస్టు 25:** "జెన్ జీని తక్కువ అంచనా వేయొద్దు రేవంత్ రెడ్డి.. కేంద్ర ప్రభుత్వాన్నే గడగడలాడించిన తరం ఇది. తెలంగాణలో లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఒక్కటై కదిలితే ప్రభుత్వం దిగిరాక తప్పదు" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు హెచ్చరించారు. జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాసబ్‌ట్యాంక్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గత 20 రోజులుగా పాలిటెక్నిక్ విద్యార్థులు జీవో 97 రద్దు కోసం పోరాడుతున్నారని పేర్కొన్నారు. "ఇది ఒక్క మాసబ్‌ట్యాంక్ పోరాటం కాదు.. ఒక్క కాలేజీ సమస్య కాదు.. లక్ష మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన పోరాటం. మీ పోరాటానికి నా సెల్యూట్" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.

### జెన్ జీ శక్తి ఏంటో ఢిల్లీలో చూశాం

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో ఢిల్లీ వీధుల్లో యువత సాగించిన ఉద్యమాన్ని ప్రస్తావించిన హరీశ్‌రావు, జెన్ జీ పోరాట శక్తిని తక్కువగా అంచనా వేయొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదే స్ఫూర్తితో తెలంగాణలో పాలిటెక్నిక్ విద్యార్థులు పోరాడుతున్నారని చెప్పారు.

### విద్యార్థులేమైనా ఉగ్రవాదులా?

మహబూబాబాద్‌లో ఆందోళన చేస్తున్న ఓ విద్యార్థి పట్ల పోలీసు అధికారి వ్యవహరించిన తీరును హరీశ్‌రావు తప్పుబట్టారు. "తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులేమైనా ఉగ్రవాదులా? వారి గొంతు పట్టి అణచివేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సూర్యాపేటలో ఓ పాలిటెక్నిక్ విద్యార్థిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో విద్యార్థినులు పోలీసులను చుట్టుముట్టి అతడిని విడిపించుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. విద్యార్థుల్లో ఉన్న ఐక్యతకు ఇదే నిదర్శనమన్నారు. "లక్ష మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఒక్కటై కదిలితే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలి. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు" అని హరీశ్‌రావు హెచ్చరించారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోగా జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటిలోగా ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

- వర్షాలు, వరదల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి
- ఎల్‌నినో ప్రభావంతో రైతులకు అవగాహన
- నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్టు 25 :** వర్షాలు, వరదలతో పాటు సీజనల్ వ్యాధులపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా అన్ని శాఖలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై రైతులను చైతన్యపరచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం సీఎస్ సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ పరిస్థితులు, వర్షాలు, ప్రజారోగ్యం, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లు, పర్యాటక రంగ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్షించారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. భారీ వర్షాలు, వరదలు సంభవించే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖలు అప్రమత్తంగా ఉండాలని, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని సీఎస్ ఆదేశించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పంటల వైవిధ్యీకరణలో భాగంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఈ నెల 30న జరగనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 30 కేంద్రాల్లో పరీక్ష జరగనున్న నేపథ్యంలో సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. తెలంగాణ పర్యాటక విధానం-2047లో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సీఎస్ సూచించారు. ప్రతి జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను గుర్తించి మౌలిక వసతులు, రవాణా అనుసంధానం, పరిశుభ్రత, పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పోలీస్ శాఖ డీజీ మహేశ్ భగవత్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులతో ఆటలొద్దు

## ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

## బీజేపీ సభలో ఎంపీ ఈటలె రాజేందర్ విమర్శలు

## స్వల్పంగా దెబ్బతిన్న రామచంద్ర రావు ఆరోగ్యం

**హైదరాబాద్, ఆగస్టు 25:** 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దని అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి అంటే అర్థం ఏంటో తెలుసా అని ప్రశ్నించారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. 'ఫీజు బకాయి - భాజపా లడాయి' పేరుతో భాజపా చేపట్టిన కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడారు. సీఎం ఒకసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి ఆలోచించాలన్నారు. 20లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను భాజపా తీసుకుందని పేర్కొన్నారు. 'నా విద్యార్థులు, నా యువత క్వాలిటీగా ఉండాలి.. ఆరోగ్యవంతులుగా ఉండాలి' అని కలలు కంటున్న నాయకుడు నరేంద్ర మోదీ అని వివరించారు. పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకొని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలని కలలు కంటున్నారని, అదే నిజమైన తెలంగాణ అభివృద్ధిగా పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం రామచందర్ రావు చేస్తున్న ఈ 48 గంటల దీక్షకు బీజేపీ అండగా ఉందన్నారు. ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అస్వస్థతకు గురయ్యారు. రామచందర్ రావును పరీక్షించిన వైద్యులు.. బీపీ 90/60గా ఉన్నట్లు తెలిపారు.'ఫీజు బకాయి-భాజపా లడాయి' పేరుతో భాజపా నేతలు రెండో రోజు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. రామచందర్ రావు దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకట రమణారెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్ పలువురు భాజపా నేతలు మద్దతు తెలిపారు.

# ఫీజులే చెల్లించరు.. విదేశీ విద్య ఎలా వస్తుంది

## లక్షలాది విద్యార్థుల మానసిక క్షోభ అర్థం కావడం లేదా

## ఫీజు చెల్లింపుల సిఎం రేవంత్ రెడ్డిపై బండి విమర్శలు



**హైదరాబాద్, ఆగస్టు 25:** ఫీజు రీయింబర్స్‌మెంట్‌కే దిక్కులేదని.. విదేశీ విద్యను అందిస్తానంటే నమ్మేదెలా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఫీజు బకాయిలు అందక ఉన్న కాలేజీలే మూత పడుతున్నాయని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యా సంస్థలను రప్పిస్తాననడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. లక్షలాది మంది విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభ సీఎంకు పట్టదా అని నిలదీశారు. 'సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీ యాజమాన్యాలు.. విద్యార్థులకు చేస్తున్న అవమానాలు కనిపించడం లేదా? ఫీజు బకాయిలు అడిగితే కాలేజీ యాజమాన్యాలను బెదరించడం తప్ప కాంగ్రెస్ సర్కార్ సాధించిందేమిటన్నారు. ఫీజు రీయింబర్స్ బకాయిల వల్ల దళిత, గిరిజన, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నా పట్టదా? ఇందిరమ్మ రాజ్యమంటే దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు ఉన్నత విద్యకు దూరం చేయడమేనా? వన్ టైం సెటిల్‌మెంట్ కింద బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైంది?' అంటూ బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. మామిలిచ్చి మోసం చేయడంలో బీఆర్ఎస్ సర్కార్‌ను మించిపోతున్నారని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. తక్షణమే రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే బీజేపీ స్టేట్ చీఫ్ రాంచంద్రరావు 'ఫీజు బకాయి- బీజేపీ లడాయి' దీక్ష చేపట్టారని చెబుతూ.. ఆయన 'దీక్ష'కు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి దీక్షకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఉద్యమిస్తున్నారన్నారు. రాంచంద్రరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచేదాకా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# నగరంలో నకిలీ వైద్యుల దందా

## 11మందిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

**హైదరాబాద్, ఆగస్టు 25:** హైదరాబాద్ నగరంలో నకిలీ వైద్యుల ముఠాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఏకంగా 11 మంది నకిలీ డాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పేరుతో సృష్టించిన నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకుని, వీరు నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో ఏకంగా క్లినిక్‌లు తెరిచి ప్రాక్టీస్ చేస్తున్నారు. ఎటువంటి అర్హత లేకపోయినా రోగులకు అల్లోపతి వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వీరు నగరంలో ఎక్కడెక్కడ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు? ఏయే విశ్వవిద్యాలయాల నుంచి నకిలీ సర్టిఫికెట్లు పొందుపరిచారు? రోగులకు ఎలాంటి వైద్యం, మందులు అందిస్తున్నారు? అనే కీలక అంశాలపై పోలీసులు ప్రస్తుతం లోతుగా విచారణ జరుపుతున్నారు. అర్హత లేని నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నకిలీ ధ్రువపత్రాలతో వీరంతా వైద్యులుగా చలామణి అవుతున్నారు. ఇలా 11 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో ప్రత్యేక ఆపరేషన్ పేరిట పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సెలైన్లు, ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నట్లు గుర్తించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. పారామెడికల్ కోర్సు చేసిన ఓ మహిళ అనుమతులు లేకుండా నాలుగేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన 11 మంది నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకుని మందులను స్వాధీనం చేసుకున్నారు.

## సంపాదకీయం



# ఇరాన్‌పై ట్రంప్ ఆర్థిక యుద్ధం!

**ఆయుధాల పోరు నుంచి ఆంక్షల అస్త్రం వైపు అమెరికా**

**'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్'తో టెహ్రాన్‌పై ఉక్కుపాదం**

**ఇరాన్‌తో వ్యాపారం చేస్తే ఇతర దేశాలపైనా ఆంక్షల హెచ్చరిక**

**60కి పైగా సంస్థలు, వ్యక్తులు, నౌకలపై వాషింగ్టన్ కొరడా**

**'రెండేళ్ల ప్రణాళిక సిద్ధం.. ప్రతీకారం తప్పదు' అంటూ ఇరాన్ సవాల్**

వాషింగ్టన్: ఆయుధాలతో సాగిన పోరు ఇప్పుడు ఆర్థిక రంగానికి మళ్లింది. ఇరాన్‌ను సైనికంగా దెబ్బతీయడంతోనే తన లక్ష్యం నెరవేరదని భావిస్తున్న అమెరికా.. టెహ్రాన్ ఆర్థిక మూలాలను ఛిద్రం చేసేందుకు భారీ ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది. అంతటితో ఆగకుండా ఇరాన్‌తో వ్యాపార, ఆర్థిక సంబంధాలు కొనసాగించే దేశాలు, సంస్థలనూ లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరించింది. దీంతో అమెరికా-ఇరాన్ ఘర్షణలో మరో ప్రమాదకర అధ్యాయం మొదలైంది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఇరాన్‌పై చరిత్రలోనే అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆంక్షలుగా అభివర్ణిస్తూ 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' పేరుతో కొత్త ప్యాకేజీని ప్రకటించారు. టెహ్రాన్‌కు ప్రపంచ దేశాలతో ఉన్న ఆర్థిక సంబంధాలను తెంచేయడం, చమురు ఆదాయానికి గండి కొట్టడం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఇరాన్‌ను ఏకాకిని చేయడమే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని అమెరికా స్పష్టం చేసింది. కొత్త ఆంక్షల పరిధిలో డిజిటల్ ఆస్తులు, సాంకేతిక రంగం, బంగారం, విమానయానం, నౌకా రవాణా, పెట్రోలియం, పెట్రోకెమికల్ వాణిజ్యం వంటి కీలక రంగాలను చేర్చారు. ఇరాన్ చమురు ఆదాయం, ఆయుధాల సేకరణ, సైబర్ కార్యకలాపాలతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో 60కి పైగా వ్యక్తులు, సంస్థలు, నౌకలపై ఆంక్షలు విధించారు. ఇరాన్‌తో సంబంధాలు కొనసాగించే మూడో దేశాలపైనా ద్వితీయ స్థాయి ఆంక్షలు విధిస్తామని అమెరికా హెచ్చరించడం మరింత కలకలం రేపుతోంది. టెహ్రాన్‌కు నగదు చలామణి, వాణిజ్య కార్యకలాపాల్లో సహకరించే దేశాలు, సంస్థలను డాలరు ఆధారిత ఆర్థిక వ్యవస్థకు దూరం చేసే చర్యలు తీసుకుంటామని బెసెంట్ స్పష్టం చేశారు. ఇరాన్‌తో ఆర్థిక భాగస్వామ్యం కొనసాగించే వారు అంతర్జాతీయంగా ఏకాకులయ్యే పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇరాన్‌తో సంబంధాలు తెంచుకోవాలని ప్రపంచ దేశాలకు అమెరికా పిలుపునిచ్చింది. తమ వైపు ఉంటారా? లేక ఇరాన్‌కు అండగా నిలుస్తారా? అన్న తరహాలో వాషింగ్టన్ వైఖరి ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇరాన్‌కు సహకరిస్తున్నట్లు అనుమానిస్తున్న విదేశీ సంస్థలు, నౌకల కార్యకలాపాలపై అమెరికా నిఘా పెంచింది. ఇరాన్‌పై అమెరికా విధించిన కొత్త ఆంక్షలను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వాగతించారు. టెహ్రాన్ ఆర్థిక మూలాలను పూర్తిగా దెబ్బతీసే దిశగా ఈ చర్యలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇరాన్‌కు ఇది 'ఆర్థిక డీ--డే'గా మారుతుందని వ్యాఖ్యానించారు. అయితే ఇప్పటికే సాగుతున్న ఘర్షణల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కనిపిస్తోంది. చమురు ధరల పెరుగుదలతో రవాణా, ఉత్పత్తి వ్యయాలు పెరిగి జీవన వ్యయంపై ఒత్తిడి మరింత తీవ్రమవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికాతో పాటు అనేక దేశాల్లో ఇంధన ధరల ప్రభావం సామాన్యులపై పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఇరాన్ చమురు సరఫరాపై మరింత ఒత్తిడి పెరిగితే అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి మరింత పెరిగే అవకాశముంది. అమెరికా ఆంక్షలకు ఇరాన్ కూడా అంతే ఘాటుగా బదులిచ్చింది. ట్రంప్ ప్రభుత్వం విధిస్తున్న ఆర్థిక ఆంక్షలను ఎదుర్కొనేందుకు తమ వద్ద రెండేళ్ల కార్యాచరణ ప్రణాళిక సిద్ధంగా ఉందని ప్రకటించింది. అమెరికా చర్యలను 'ఆర్థిక ఉగ్రవాదం'గా అభివర్ణిస్తూ.. ఇకపై తాము కేవలం రక్షణాత్మక వైఖరికే పరిమితం కాబోమని హెచ్చరించింది. ఇరాన్ ఆర్థిక మంత్రి అలీ మదానీజాదేహ్ మాట్లాడుతూ అమెరికా ఆంక్షలను ఎదుర్కొనేందుకు దేశం సర్వసన్నద్ధంగా ఉందన్నారు. తమపై ఆర్థికంగా దాడి చేయాలని శత్రువులు ప్రయత్నిస్తున్నారని, వాటిని తిప్పికొట్టేందుకు తమ వద్ద కూడా అవసరమైన సాధనాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమెరికాకు మరో ఓటమి తప్పదని వ్యాఖ్యానించారు. అమెరికా ఒత్తిడికి తమ వాణిజ్య భాగస్వాములు తలొగ్గబోరని ఇరాన్ విశ్వాసం వ్యక్తం చేసింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ గాలిబాఫ్ స్పందిస్తూ.. ఇతర దేశాలతో తమకున్న సంబంధాలను తెంచగలిగే స్థితిలో అమెరికా లేదన్నారు. అమెరికా ఆంక్షలను పట్టించుకోబోమని తమ వాణిజ్య భాగస్వాముల నుంచి ఇప్పటికే సందేశాలు అందినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యా కూడా అమెరికా ఆంక్షలను అంగీకరించబోవని ఇరాన్ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు అమెరికాకు సహకరించే దేశాలకు ఇరాన్ నుంచి తీవ్ర హెచ్చరికలు వెలువడ్డాయి. పర్షియన్ గల్ఫ్, హార్ముజ్ జలసంధి అంశాన్ని తెరపైకి తీసుకొస్తూ.. తమకు వ్యతిరేకంగా పొరుగు దేశాలు సహకరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ నేతలు హెచ్చరించారు. హార్ముజ్ జలసంధి నుంచి చమురు రవాణాకు ఆటంకం ఏర్పడితే దాని ప్రభావం ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్రంగా ఉండే అవకాశముంది. ఇప్పటివరకు సైనిక దాడులు, ప్రతిదాడులతో సాగిన అమెరికా--ఇరాన్ ఘర్షణ ఇప్పుడు ఆర్థిక వ్యవస్థల మధ్య పోరుగా రూపాంతరం చెందుతోంది. ఇరాన్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నుంచి వేరుచేయాలన్నది వాషింగ్టన్ వ్యూహమైతే.. అమెరికా ఆంక్షలను తట్టుకుని తన వాణిజ్య సంబంధాలను కొనసాగించాలన్నది టెహ్రాన్ లక్ష్యంగా కనిపిస్తోంది. దీంతో ఈ పోరు రెండు దేశాలకే పరిమితం కాకుండా ప్రపంచ దేశాలను ఏదో ఒక వైపు నిలబడే పరిస్థితిలోకి నెడుతుందా అన్న ఆందోళన మొదలైంది.

# తెలంగాణ మోడల్‌లో కులగణన

- జనగణనలో కులగణన విధానం సరిగా లేదు
- ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు
- ప్రధాని మోడీకీ రాహుల్, ఖర్గేల లేఖ



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** జనగణన పద్ధతిపై కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం ఖర్గే, రాహుల్ సుదీర్ఘ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కులగణలో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులాల నమోదుకు 'ఓపెన్-ఎండెడ్' విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కులాల లెక్కింపు విధానాలతో తీవ్ర నష్టం జరుగుతోందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకే కులం వేర్వేరు పేర్లతో విడిపోయి లక్షలాది కులాల పేర్లుగా నమోదవుతాయని.. దీనివల్ల లెక్కింపు డేటా పూర్తిగా నిరుపయోగంగా మారుతుందని తెలిపారు. ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే పదమే లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బీసీ, ఓబీసీ కులాల నమోదుకూ 'డ్రాప్-డౌన్ జాబితా' విధానాన్ని ఉపయోగించాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సూచించారు. తెలంగాణ (2024), బిహార్ (2022) సర్వేల్లో వాడిన కులాల జాబితా నమూనాలను ప్రధానికి పంపించారు. ప్రస్తుత గందరగోళ ప్రశ్నావళిని వెంటనే రద్దు చేసి, అన్ని పార్టీలు - నిపుణులతో చర్చించి ఓ కొత్త ప్రశ్నావళిని రూపొందించాలని ఖర్గే, రాహుల్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడంలేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులపై మీడియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి. 2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు. ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడంలేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

# భవిష్యత్ తరానికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది

**గడ్కరీ వ్యాఖ్యలతో రాజకీయ కలకలం**

**కేంద్రంలో కొత్త తరానికి అవకాశం ?**



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** కేంద్ర మంత్రిమండలిలో మార్పులు చేర్పులపై గత కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్న వేళ కేంద్రమంత్రని నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు రాజకీయకాకను రేపుతున్నాయి. యువతరానికి బాధ్యతలు అప్పగించాల్సన సమయం వచ్చిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తతరానికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్కరీ తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నేను చేయాలనుకున్నంత కాలం పనిచేశాను. ప్రస్తుతం నేను మునుపటిలా పనిచేయలేకపోతున్నా. ప్రజాపనుల్లో ప్రమేయం తగ్గిపోయింది. ఆ పనిని కొత్త తరాలకు అప్పగించాలి. కొత్తవారికి సీనియర్లు మార్గనిర్దేశం చేస్తున్నారు. నేను గత 30 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉన్నాను. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. అవార్డులూ అందుకున్నాను అని గడ్కరీ గుర్తుచేసు కున్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. భవిష్యత్‌లో అభివృద్ధి పనుల సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. మహారాష్ట్రలో ప్రతి ఆదివాసీ గ్రామానికి విద్యుత్ సదుపాయాన్ని కల్పించడమే తన లక్ష్యమన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ అఠవాలే వెల్లడించిన సంగతి తెలిసిందే. భాజపా, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగతంగానూ భాజపాలో భారీ మార్పులు జరిగిన సంగతి తెలిసిందే. మరోవైపు.. 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న నితిన్ గడ్కరీ ఆ విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ పలువురు నెటిజన్లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు, పోస్టులు పెడుతున్నారని బాంబే హైకోర్టును కూడా ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఈ నేపథ్యంలో ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వార్తల వేళ గడ్కరీ మాటలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడుతూ.. దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నానని గుర్తు చేసుకున్నారు. గతంలో పార్టీ, ప్రభుత్వం కోసం విస్తృతంగా పని చేశానని.. ఇప్పుడు తన చురుకైన పాత్రను క్రమంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు బాధ్యతలు అప్పగించి, వారు పని చేసే అవకాశాన్ని కల్పించాలన్న అభిప్రాయాన్నీ ఆయన వ్యక్తం చేశారు. ఇకపై తీవ్రమైన పాలనాపరమైన ఒత్తిళ్ల కంటే సామాజిక సంక్షేమం, గిరిజన ప్రాంతాలు, రైతుల శ్రేయస్సుపైనే దృష్టి సారిస్తానంటూ నితిన్ గడ్కరీ సంకేతాలు ఇచ్చారు. మహారాష్ట్రలో ఏ గిరిజన గ్రామమూ విద్యుత్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదన్న లక్ష్యాన్నీ గడ్కరీ ప్రస్తావించారు. 'చేసినంత కాలం చేశాను.. ఇప్పుడు కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి' అని అన్నారు. గడ్కరీ చేసిన ఈ వ్యాఖ్యలు బీజేపీలో జరుగుతున్న తరాల మార్పుపై మరోసారి చర్చకు దారితీశాయి. ఇటీవల పార్టీ సంస్థాగత స్థాయిలో చోటుచేసుకున్న మార్పుల నేపథ్యంలో కేంద్ర మంత్రి తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.



# అమెరికా చదువులపై విద్యార్థుల్లో అనాసక్తి

**ఉద్యోగార్థుల్లోనూ పెరుగుతున్న నిరాశ**

**ట్రంప్ ఆంక్షలతో విసుగెత్తుతున్న భారతీయులు**

**చదువుల కోసం వెళ్లేవారి సంఖ్య గణనీయంగా తగ్గుదల**

**వాషింగ్టన్, ఆగస్టు 25:** ట్రంప్ తీరుతో అమెరికాలో ఉంటున్న భారతీయులకు, అమెరికా వెళ్లాలనుకుంటున్న విద్యార్థులకు సైతం విసుగు వస్తోంది. పదేపదే ఏదో ఒక ఆంక్ష కారణంగా అక్కడి విశ్వవిద్యాలయాలు కూడా ఆర్థికంగా దెబ్బ తింటున్నాయి. భారతీయ విద్యార్థుల రాక తగ్గిందని అక్కడి సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. 'కామన్ యాప్' నివేదికల ప్రకారం.. 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో 3.63 లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు చేరారు. ఇక 2025-26లో అమెరికా కళాశాలల్లో కోర్సులలో ప్రవేశం కోరే భారత విద్యార్థుల సంఖ్య 15శాతం పడిపోయింది. మరోవైపు 2026 సెమిస్టర్‌లో అమెరికా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ విద్యార్థుల నమోదులో కూడా 1.1 లక్షల తగ్గుదల కనిపించింది. 2025-26లో ఈ సంఖ్య 11.69 లక్షలుగా అంచనా వేయగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 10.57 లక్షలకు చేరింది. కఠినమైన వీసా నిబంధనలు, చదువు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, సోషల్ మీడియా వెట్టింగ్ వంటి అంశాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అయితే తాజా ఆంక్షల వార్తల కారణంగా అమెరికాలో ఉద్యోగం చేయాలన్న వారి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. అలాగే అక్కడ చదువుకోవాలన్న ఆశను కూడా వదులుకుంటున్నారు. ఓపిటి నిబంధలను కఠినతరం చేయడం, వీసా ఫీజులు పెంచి నిబంధనలు మరింత క్లిష్టంగా మార్చడంతో భారతీయ విద్యార్థులు అమెరికావైపు చూసేందుకు ఇష్టపడడం లేదని సర్వేలు చెబుతున్నాయి. అమెరికా ఫస్ట్ నినాదంతో ట్రంప్ ఊగిపోతున్నాడు. అమెరికన్లకే శిక్షణ ఇవ్వాలని అక్కడి టెక్కీ సంస్థలపై ఒత్తిడి పెంచుతున్నారు. హెచ్-1బి వీసాల పై ట్రంప్ ప్రభుత్వం విధించిన కొత్త రుసుమును అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సమర్థించారు. కంపెనీలు విదేశీ ఉద్యోగులను తీసుకోకుండా.. అమెరికన్లను నియమించుకోవాలని సూచించారు. వారికి మెరుగైన శిక్షణ ఇవ్వాలన్నారు.

# ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్ట్‌లు

**మాదక ద్రవ్యాలు వినియోగంచకుండా ఆంక్షలు**

**టెస్ట్ వ్యవహారాలను పరిశీలిస్తున్న డీజీసీఏ**

**కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 25:** ఇకపై ఏడాదికి ఒక్కసారైనా విమాన పైలట్లకు డోప్ టెస్టులునిర్వహించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. పైలట్లు మాదకద్రవ్యాల, మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అరికట్టేందుకు, భవిష్యత్తులో కఠినమైన నిబంధనలు తెచ్చేందుకు డీజీసీఏ ప్రస్తుతం విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోందని చెప్పు కొచ్చారు. ప్రస్తుతం మొత్తం పైలట్ల సంఖ్యలో 10 శాతం మందికి మాత్రమే డోప్ టెస్టులు నిర్వహించాలనే నిబంధన అమల్లో ఉందని చెప్పారు. ఏడాదిలో ఒకసారి ప్రతి పైలట్‌కూ పరీక్ష నిర్వహించేలా దీనిని మార్పు చేయాలనే అంశాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరిశీలిస్తోందన్నారు. భద్రత, నిర్వహణ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను మరింత కఠినం చేసే మార్గాలపైనా డీజీసీఏ అధ్యయనం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా పుకెట్-ఢిల్లీ విమాన ఘటనపై మాట్లాడుతూ.. దీనిపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందన్నారు. విమానంలోని పైలెట్ డేటా రికార్డర్ దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. థాయ్‌లాండ్ నుంచి ఢిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్-ఇన్- కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్ష నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధరణ అయ్యింది. ఈ ఘటనపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు జరుపుతోందని పేర్కొన్నారు. విమానం డేటా రికార్డర్లు, ఇతర భాగాలు సురక్షితంగా ఉన్నందున, త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పైలట్ నెట్‌వర్క్‌లో కేవలం పదిశాతం మందికి మాత్రమే రాండమ్‌గా డోప్ టెస్టులు నిర్వహిస్తున్నారని రామ్మోహన్ వెల్లడించారు. ప్రతీ పైలట్‌కు సంవత్సరంలో కనీసం ఒక్కసారైనా రాండమ్‌గా పరీక్ష నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. విమాన ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. విమాన సంస్థల ఆపరేషనల్ ప్రభావం కూడా దెబ్బతినకుండా ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటిస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

చురకలు



# విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం




: **నేరడిగొండ:** విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని సర్పంచ్ ఉజ్వల జాదవ్ అన్నారు. మండలంలోని బుగ్గారం(కె) ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు షూస్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ జాదవ్ సుజాత, ఎంపీపీ చైర్మన్ రాథోడ్ భీమునీ బాయిలతో కలిసి విద్యార్థులకు షూస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యం, పాఠశాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాజ్‌కుమార్, సతీష్, అంగన్‌వాడీ టీచర్ సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వనమహోత్సవం



: **నేరడిగొండ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వనమహోత్సవం' కార్యక్రమాన్ని నేరడిగొండ మండలంలోని బోథ్ ఎక్స్ రోడ్డు, వాగ్దారి రోడ్డు ప్రాంతంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ ఎస్పీ పి.మౌనిక, ఉట్నూర్ ఏఎస్పీ, ఎస్డీపీఓ రుత్విక్ సాయి కొట్టే, జిల్లా అటవీ శాఖాధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ బొబాడే, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు హరిత తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. మొక్కల సంరక్షణకు ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎఫ్‌డీఓ చిన్న భూసారెడ్డి, ఇచ్చోడ ఎఫ్‌డీఓ ప్రథమేష్ కేశవ్ తిజారే, నేరడిగొండ ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ సవిత, బోథ్ ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ, ఇచ్చోడ ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ ఇబ్రహీం షరీఫ్, ఉట్నూర్ ఎఫ్ఆర్ఓ, ఇంద్రవెల్లి ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ ఆర్.శీలానంద్, అటవీ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు.. ఒకరికి తీవ్ర గాయాలు



: **సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సత్తుపల్లి నుంచి అశ్వరావుపేట వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సత్తుపల్లి ప్రాంతానికి చెందిన అసోజు రామకృష్ణ సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో బైక్‌పై సత్తుపల్లి వైపు వస్తుండగా, సత్తుపల్లి నుంచి అశ్వరావుపేట వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఆయన ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రామకృష్ణ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రీ-మెట్రిక్ స్కాలర్ షిప్ కోసం దరఖాస్తుల స్వీకరణ

**ఆసిఫాబాద్ టౌన్:** జిల్లాలో అర్హత కలిగిన గిరిజన విద్యార్థులకు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ అందించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ గురుకుల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు తదితర పాఠశాలలలో చదువుతున్న అర్హత కలిగిన ఎస్టీ విద్యార్థులు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పోర్టల్ https://telanganaepass.cgg.gov.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థి ఫోన్ నంబర్, ఆధార్, బ్యాంకు ఖాతా, కులం, ఆదాయం, విద్యా వివరాలను సరిచూసుకుని నమోదు చేయాలని, విద్యార్థి బ్యాంకు ఖాతా క్రియాశీలంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అవసరమైన పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా



: **ఆదిలాబాద్:** విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక బొక్కల్‌గూడ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషతో కలిసి నూతన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం కళాశాల ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాలను మెరుగుపర్చేందుకు ప్రత్యేకంగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సుమారు 1,200 మంది విద్యార్థులతో నాలుగు మీడియాల్లో విద్యాబోధన కొనసాగుతున్న బొక్కల్‌గూడ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల జిల్లాకే తలమానికంగా నిలుస్తోందని కొనియాడారు. అసంపూర్తిగా ఉన్న మొదటి అంతస్తులోని నాలుగు నూతన తరగతి గదులను ఖర్చుకు వెనుకాడకుండా పూర్తి చేసి ప్రారంభించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలోనే ఉండి ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా అభ్యసించాలని సూచించారు. తరగతులకు క్రమం తప్పకుండా హాజరైతేనే సబ్జెక్టులపై పూర్తి పట్టు సాధించగలరని, తద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన డిజిటల్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ర్యాంకులు సాధించి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు అధ్యాపకులను గౌరవించి, వారి సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్‌రాజర్షిషా, అతిథులు మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, డీఐఈఓ గణేష్ జాదవ్, డీఎంబ్ల్యూఓ కలీం, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ వార్డుల కౌన్సిలర్లు సుచిక, సుష్మా, సంజయ్, జీవన్, ఇతర అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలి



: **తాండూర్:** పంటల సాగులో రైతులు పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ప్రధాన పంటల్లో సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులు సమర్థవంతంగా అమలు చేసేందుకు తాండూర్ మండలం కొత్తపల్లి రైతు వేదికలో మంగళవారం ఆత్మ ఆధ్వర్యంలో ఆర్‌పీఎల్ ఆధారిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 30 మంది రైతులకు పత్తి, వరి, కంది తదితర పంటల్లో చీడపీడల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పంట సాగు ప్రారంభం నుంచే పొలాన్ని పరిశుభ్రంగా ఉంచడం, నాణ్యమైన విత్తనాలను వినియోగించడం, పంట మార్పిడి పాటించడం, సమతుల్య ఎరువులు వాడటం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. పంటల్లో చీడపీడల ఉనికిని ఎప్పటికప్పుడు గమనించి, అవసరమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒకే రకమైన పురుగుమందును పదేపదే ఉపయోగించకుండా మందుల మార్పిడి విధానాన్ని పాటించాలని, తద్వారా పురుగుల్లో మందుల నిరోధకతను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి ప్రేమ్ కుమార్, తాండూర్ మండల వ్యవసాయ అధికారి సుష్మ, వ్యవసాయ విస్తరణ అధికారులు రాకేష్, వెంకటేష్, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

# యాప్‌ను రద్దు చేసి పాత పద్ధతిలోనే యూరియా అందించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా.. రైతుల నుంచి సంతకాల సేకరణ




: **సత్తుపల్లి:** యూరియా కొరతను నివారించి రైతులకు సకాలంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం గంగారం గ్రామ ప్రాథమిక సహకార సొసైటీ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం రైతుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ యూరియా పంపిణీ కోసం అమలు చేస్తున్న యాప్ విధానం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. యాప్‌లో నమోదు, సాంకేతిక సమస్యలు, సర్వర్ సమస్యల కారణంగా రైతులు గంటల తరబడి ఎరువుల కోసం వేచి ఉండాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా యాప్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, గతంలో మాదిరిగానే రైతులకు అవసరమైన మేరకు యూరియాను సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ప్రతిఒక్కరికీ సరిపడా యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా కఠిన చర్యలు చేపట్టాలని, రైతులకు న్యాయమైన ధరకు ఎరువులు అందేలా ప్రభుత్వం పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, కావూరి వెంకటేశ్వరరావు, గుంట్రూ జయరాజు, పటాన్ తనిషా, బెజవాడ లక్ష్మీనారాయణ, బండారు వెంకటేశ్వరరావు, వేమాల బ్రహ్మారావు, గుండి సింగరాజు, వసంతరావు, ఈర్ల శ్రీను, చీపు సత్యనారాయణ, పాకనాటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత



: **సత్తుపల్లి:** సమాజంలో వెనుకబడిన దివ్యాంగులకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలిచి చేయూతనందించడం అభినందనీయమని తల్లాడ గ్రామపంచాయతీ కార్యదర్శి హరికృష్ణ అన్నారు. మంగళవారం తల్లాడలో ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగురాలు బత్తుల నాగేంద్రమ్మకు వీల్‌చైర్‌ను పంపిణీ చేశారు. ఇశ్రాయేలు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఖమ్మంపాటి ఇశ్రాయేలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హరికృష్ణ మాట్లాడుతూ "మానవ సేవే మాధవ సేవ" అని పేర్కొన్నారు. దివ్యాంగులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షులు ఖమ్మంపాటి ఇశ్రాయేలు మాట్లాడుతూ దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందించడం సంతోషంగా ఉందన్నారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెంకటేశ్వరరావు, నారపోగు ప్రసాద్, దారెల్లి బాబు, చల్లా దుర్గాప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రైతు నేత మల్లారెడ్డి మృతి తీరని లోటు




: **తాండూర్:** ప్రముఖ రైతు నేత, సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి తీరని లోటని సీపీఎం నాయకులు అన్నారు. ఆయన మృతి పట్ల తాండూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. తాండూర్ మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు దాగం రాజారాం మాట్లాడుతూ కష్టజీవుల హక్కుల కోసం, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం మల్లారెడ్డి జీవితాంతం అంకితభావంతో పోరాడారని అన్నారు. ఆయన మృతి వామపక్ష, రైతు ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో వరంగల్ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునర్నిర్మించడంలో, పార్టీతో పాటు రైతు సంఘాన్ని విస్తరించడంలో మల్లారెడ్డి ఎనలేని కృషి చేశారని గుర్తుచేశారు. ఫ్యూడల్ భావజాలం, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేదలు, దళితుల భూముల పరిరక్షణ కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ప్రజా పోరాటాలతో పాటు సాగునీరు, రైతు సమస్యలపై అనేక పుస్తకాలు రచించారని, నదీ జలాలు, ప్రాజెక్టులు, తెలంగాణ సాగునీటి వనరులు, అవకాశాలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నారని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలకు ముందు సీపీఎం ఎమ్మెల్యేలు, ఎంపీలకు ప్రజా సమస్యలపై అవగాహన కల్పించి వాటిని సభల్లో ప్రస్తావించేలా చేసేవారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సంతాప సభలో దుర్గం నాన్నయ్య, వేల్పుల శంకర్, బొల్లం రాజేశం, కొమ్మ రాజయ్య, రామగిరి వరలక్ష్మి , ఊరడి సరిత, దుర్గం నాగలక్ష్మి , కె.బాపు తదితరులు పాల్గొన్నారు.

# పొలిటికల్ క్లియరెన్స్ అంటే రాజకీయ కుట్ర కాదు

- ఫ్యూచర్ సిటీకి పెట్టుబడులు రావడం లేదనే ఆక్రోశంతోనే రేవంత్ వ్యాఖ్యలు
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్




: **హైదరాబాద్:** పొలిటికల్ క్లియరెన్స్ అంటే రాజకీయ కుట్ర కాదని, విదేశీ పర్యటనలకు కేంద్ర విదేశాంగ శాఖ నుంచి పొందాల్సిన అనుమతి అని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్యూచర్ సిటీకి పెట్టుబడులు రావడం లేదనే ఆక్రోశంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ కుట్ర అంటూ మాట్లాడుతున్నారని ఆరోపించారు. 30 నెలల పాలన తర్వాత రేవంత్ రెడ్డికి తెలంగాణ ఆత్మగౌరవం గుర్తుకొచ్చిందని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. విదేశీ పర్యటనకు వెళ్లే ముందు ఎవరిని కలుస్తారు, ఏ కార్యక్రమాల్లో పాల్గొంటారు, పర్యటన ద్వారా కలిగే ప్రయోజనాలు ఏమిటి తదితర వివరాలను విదేశాంగ శాఖకు సమర్పించి అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు ఐదు రోజుల ముందే దరఖాస్తు చేసుకున్నారని, ఇంగ్లాండ్‌కు అనుమతి వచ్చినప్పటికీ అమెరికాకు అనుమతి రాలేదని పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావులు గతంలో మంత్రులుగా విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ముందుగానే అన్ని అనుమతులు తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, షెడ్యూల్‌ను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. అమెరికాలో ఎవరిని కలవాలనుకున్నారు, ఏ స్ట్రాటజిస్టులు, స్టేక్‌హోల్డర్లతో సమావేశాలు నిర్వహించాలనుకున్నారనే వివరాలను వెల్లడించాలని కోరారు. ఫ్యూచర్ సిటీని రియల్ ఎస్టేట్ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో విదేశీ విశ్వ విద్యాలయాలను అక్కడ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల్లోని విశ్వవిద్యాలయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదివానని తెలిపారు. విదేశీ విశ్వ విద్యాలయాల క్యాంపస్‌ల ఏర్పాటుపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. విదేశీ యూనివర్సిటీల కోసం ప్రయత్నించడం కంటే ఉస్మానియా, కాకతీయ, మహాత్మా గాంధీ, పాలమూరు విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా జలాలు, బనకచర్ల అంశాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రికి తెలంగాణ ఆత్మగౌరవం ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పు తదితర అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి తెలంగాణకు ద్రోహం చేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి విదేశీ పర్యటన కోసం ఏం దరఖాస్తు చేసుకున్నారు, అమెరికా పర్యటనకు అనుమతి ఎందుకు నిరాకరించబడిందో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించకుండా పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు.

# విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- నిర్మాణ, మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలి
- కేజీబీవీని సందర్శించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

:



**గంభీరావుపేట:** విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, స్టోర్ రూమ్‌ను పరిశీలించి, తరగతి గదులు, వసతి, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనుల పురోగతిని పరిశీలించి, వీలైనంత త్వరగా నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న టాయిలెట్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచి, త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. విద్యాలయంలో నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా అధికారులను సూచించారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని తెలిపారు. వంటకు ఉపయోగించే సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట సర్పంచ్ మల్లుగారి పద్మ, పంచాయతీరాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డి, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఈఈలు అన్వర్, సుమలత, ఎంపీడీఓ రాజేందర్, జీసీడీఓ పద్మజ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# నర్సాపూర్‌లో ఘనంగా వనమహోత్సవం

: **తాండూర్:** తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ప్రభాత్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తాండూర్ ఎంపీడీఓ శ్రీనివాస్, మంచిర్యాల డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నాటిన మొక్కలు భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగి భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందిస్తాయని అన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేసి నవారవుతారని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో ఎంతమంది కుటుంబ సభ్యులు ఉంటే వారి పేర్లతో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు విస్తృతంగా వనమహోత్సవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఉప సర్పంచ్ మడావి పర్వత్



రావు, ఈజీఎస్ అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్ఓబీ కోసం జాయింట్ ఇన్‌స్పెక్షన్

: **తాండూర్:** దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో రైల్వే లైన్ల విస్తరణ, అభివృద్ధిలో భాగంగా లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ), రోడ్డు అండర్ బ్రిడ్జి, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా తాండూర్ మండలంలోని రేపల్లెవాడ లెవెల్ క్రాసింగ్ వద్ద ఆర్ఓబీ నిర్మాణానికి సంబంధించి అధికారులు మంగళవారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. రెచ్నీ రోడ్–రేపల్లెవాడ స్టేషన్ల మధ్య ఎల్‌సీ–68 రేపల్లెవాడ లెవెల్ క్రాసింగ్, కిలో మీటర్ 226/12–14 వద్ద చేపట్టిన ఈ పరిశీలనలో రేపల్లెవాడ, కొత్తపల్లి గ్రామాల పరిధిలో ఆర్ఓబీ నిర్మాణానికి అనువైన ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్లను అధికారులు పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు



పాల్గొని క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఆర్ఓబీ నిర్మాణంతో భూములు నష్టపోయే అవకాశం ఉన్న ప్రాంతాల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలను అధికారులకు తెలియజేశారు. జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సుందర్, రైల్వే రోడ్ సెక్టార్ ప్రాజెక్ట్ భూసేకరణ నిపుణులు పి.దేవరాజు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న, తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్, జాతీయ రహదారుల అధికారులు, రోడ్లు భవనాల శాఖ, అటవీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆకుల వెంకటేష్, మండల నాయకులు పాల్గొన్నారు.

# డొంగ్లీలో ఘనంగా వనమహోత్సవం

: **డొంగ్లీ:** వనమహోత్సవంలో భాగంగా డొంగ్లీ గ్రామంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంజిత్ కుమార్, స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ జగదీష్, ఎంఈఓ, వ్యవసాయ అధికారి శివకుమార్, ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చెట్ల పెంపకం, అడవుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే వనమహోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. వ్యవసాయ అధికారి శివకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2వేల మొక్కలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, రైతులకు మొక్కలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన మొక్కలను డొంగ్లీ–ఖత్‌గావ్ రహదారి వెంట నాటనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, తహశీల్దార్ రంజిత్ కుమార్, స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ జగదీష్, ఎంఈఓ, ఏఓ శివకుమార్, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# అదుపుతప్పి ఆటో బోల్తా

## నలుగురికి తీవ్ర గాయాలు

: **సత్తుపల్లి:** మొక్కలు నాటేందుకు కూలీలను తీసుకెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటన వేంసూర్ మండలం ఎర్రగుంటపాడులో మంగళవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు కూలీలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వేంసూర్ గ్రామంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన సుమారు పది మంది కూలీలు రాయుడుపాలెం శివారులో మొక్కలు నాటేందుకు ఆటోలో బయల్దేరారు. ఈ క్రమంలో ఎర్రగుంటపాడు సమీపంలో రహదారిపై అకస్మాత్తుగా పిల్లి అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటో అదుపుతప్పి పల్టీలు కొడుతూ బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో ఎనిమిది మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రథమ చికిత్స అనంతరం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సెప్టెంబర్ 2న చలో ఎస్టీ కమిషనరేట్ ముట్టడి

## లైవ్ జిల్లా అధ్యక్షులు జాదవ్ మహేందర్




: **నేరడిగొండ:** ప్రజాస్వామ్య దేశంలో ఆదివాసీ లంబాడీలను విదేశీ పౌరులుగా చూస్తూ అధికారులు సవాలక్ష కొర్రీలు పెడుతూ తీరని అన్యాయం చేస్తున్నారని లంబాడీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ మండిపడ్డారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఒక కొత్త నిబంధన పెట్టి లంబాడీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడా లేని నిబంధనలు ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం లంబాడీలకు 1954–55 నాటి కాసరా పహాని, లేనియెడల అప్పటి దస్తావేజులను అడగడం మా జాతిని వేధించడమే తప్పా మరొకటి కాదన్నారు. గత కొన్ని రోజులుగా మా జాతి పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వచ్చేనెల 2వ తేదీన చలో ఎస్టీ కమిషనరేట్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రతి బంజారా తండా, ప్రతి మండలం, జిల్లా నుంచి లక్షలాది మంది బంజారాలు తరలివచ్చి మన బంజారా జాతి సత్తా ఏమిటో చూపించాలని పిలుపునిచ్చారు.

# భూముల రీ సర్వే ఖచ్చితత్వంతో చేయాలి

: **గంభీరావుపేట:** భూ భారతి కింద చేపడుతున్న భూముల రీ సర్వేను



ఖచ్చితత్వంతో నిర్వహించి, వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లిలో రోవర్ యంత్రంతో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే యంత్రం ద్వారా భూముల వివరాలను ఎలా సేకరిస్తున్నారో పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దు సర్వే పూర్తయిందని, ప్రస్తుతం ప్రభుత్వ భూముల సర్వే కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూ భారతి కింద రీ సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే నిర్వహించే విషయాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలని, భూముల వివరాలను పూర్తి ఖచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం గంభీరావుపేట మండలం గజసింగవరంలో గ్రామ బోర్‌వెల్ వద్ద చేపడుతున్న రీచార్జ్ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలోని రైతులు, గృహ నిర్మాణదారులు బోర్‌వెల్ రీచార్జ్ పనులు చేపట్టేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, ఏడీ సర్వే శ్రీనివాస్, ఎంపీడీఓ రాజేందర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభ ఉపకార వేతన పరీక్ష దరఖాస్తు గడువు పొడిగింపు

: **మంచిర్యాల:** జాతీయ ఆదాయ ఆధారిత ప్రతిభ ఉపకార వేతన పథకం కింద 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్ష దరఖాస్తు గడువు పొడిగించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ పాఠశాలలలో విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 1వ తేదీ లోగా ఆన్‌లైన్ లో http//bse.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సెప్టెంబర్ 3వ తేదీలోగా జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ఆన్‌లైన్ అప్లికేషన్ల హార్డ్ కాపీలను అందజేయాలని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎక్కువ మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జనరల్ బి.సి. విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ విద్యార్థులు రూ.50 ఆన్లైన్ లో రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



# కుంటాల రిసార్ట్స్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



: **నేరడిగొండ:** మండలంలోని జలపాతానికి సమీపంలో రూ.3.5 కోట్ల వ్యయంతో చేపట్టిన కుంటాల రిసార్ట్స్ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా మంగళవారం పరిశీలించారు. పనుల ప్రగతిని సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రిసార్ట్స్ ప్రాంగణంలో పర్యాటకులకు అవసరమైన అన్నిరకాల మౌలిక వసతులు, అదనపు సౌకర్యాలపై తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. బోటింగ్ పాయింట్ వద్ద పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, భద్రతా ప్రమాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా రిసార్ట్ ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటి నీరు పోశారు. ఈ పర్యటనలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డిప్యూటీ ఇంజనీర్ ఆంజనేయులు, జిల్లా టూరిజం అధికారి రవి కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి తానాజీ, డిఆర్డీఓ రవీందర్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జైనూర్ నూతన ఎంపీడీఓ కృష్ణవేణికి ఘన సన్మానం



: **జైనూర్:** జైనూర్ మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ కృష్ణవేణిని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జైనూర్ మండలం ఏజెన్సీ ప్రాంతం కావడంతో మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధిపై ఎంపీడీఓ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ముఖ్యంగా రోడ్లు, వైద్యం, విద్య, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతుల విషయంలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన అన్ని వర్గాలకు సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం సరిగా లేని మారుమూల గ్రామాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. జైనూర్ మండల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ సంఘాలు, ప్రజలతో సమన్వయంతో పనిచేస్తూ మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. నూతన ఎంపీడీఓ కృష్ణవేణి ఆధ్వర్యంలో జైనూర్ మండలం మరింత అభివృద్ధి సాధించాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్ రావు, తొడసం రాజేందర్, రవి కుమార్, ఆత్రం తులసి శంకర్, పెందోర్ అనుసయ అర్జున్, మాడవి కౌసల్య, జాదవ్ భావ్ రావు, విఠల్, నిర్మల, ఆత్రం అయ్యు భుజంగ్ రావు, సార్ మేడి గేడం గణపత్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గేడం గోపీచంద్, నాయకులు కృష్ణ, మెస్రం షేకు, లచ్చు, జామిల్, మక్కు, కేశవ్, రాంజీ తదితరులు పాల్గొన్నారు.

# దేవుడు గుడిలోనే కాదు... తెల్లకోటు వేసుకుని కూడా వస్తాడు!

- **హెచ్ సీవీ పాజిటివ్ చిన్నారికి సర్జరీకి ఎవరూ ముందుకు రాని వేళ... పునర్జన్మనిస్తున్న ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్**



: **ఆదిలాబాద్:** వైద్యో నారాయణో హరిః అనే మాటను నిజం చేస్తూ ఆదిలాబాద్ రిమ్స్ లో మానవత్వం పరిమళించింది. హెచ్‌సీవీ పాజిటివ్ అని తెలియగానే 12 ఏళ్ల చిన్నారికి సర్జరీ చేయడానికి అందరూ వెనకడుగు వేసిన క్లిష్ట సమయంలో "ఈ పాప ప్రాణం నా బాధ్యత" అంటూ ఓ వైద్యుడు దేవుడిలా ముందుకు వచ్చారు. ఆయనే ఆదిలాబాద్ రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్.

**అసలేం జరిగింది..**

ఆదిలాబాద్ రిమ్స్ కు తీవ్ర అనారోగ్యంతో వచ్చిన 12 ఏళ్ల చిన్నారికి వైద్యులు పరీక్షలు నిర్వహించగా అత్యవసరంగా సర్జరీ చేయాలని తేలింది. అయితే రొటీన్ పరీక్షల్లో ఆ చిన్నారికి హెచ్‌సీవీ పాజిటివ్ అని తేలడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఇన్‌ఫెక్షన్ భయంతో సర్జరీ విషయంలో జాప్యం జరుగుతున్న తరుణంలో ఈ విషయం రిమ్స్ డైరెక్టర్ దృష్టికి వెళ్ళింది.

**డైరెక్టర్ సంచలన నిర్ణయం..**

విషయం తెలుసుకున్న డాక్టర్ జై సింగ్ రాథోడ్ ఏ మాత్రం ఆలస్యం చేయలేదు. వెంటనే స్పందించి వైద్య బృందానికి ధైర్యం చెప్పారు. వైద్యుల భద్రత కోసం అత్యంత రక్షణ కలిగిన ప్రత్యేక సర్జికల్ కిట్ ను తన సొంత చొరవతో తక్షణమే ఏర్పాటు చేయించారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని ఆపరేషన్ చేయాలని ఆదేశించి, స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. డాక్టర్ ఈ నిర్ణయంతో రేపు ఆ చిన్నారికి కీలకమైన ఆపరేషన్ జరగనుంది. దీంతో ఆ చిన్నారి కుటుంబంలో మళ్లీ ఆశలు చిగురించాయి. వైద్య వృత్తిని వ్యాపారంగా కాకుండా సేవగా భావించి, ఒక చిన్నారి ప్రాణాన్ని కాపాడేందుకు తెగువ చూపిన డాక్టర్ జై సింగ్ రాథోడ్ నిజంగా రియల్ హీరో.. వైద్య వృత్తికి అసలైన నిర్వచనం చెప్పిన ఆయన పెద్ద మనసుకు జిల్లా ప్రజలందరు హృదయపూర్వక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.

# గంభీరావుపేట–లింగన్నపేట బ్రిడ్జికి గ్రహణం..!





- **ఉగ్రరూపం దాల్చిన మానేరు వాగు**
- **భారీ వరద నీటితో కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి రోడ్డు**
- **నిలిచిపోయిన రాకపోకలు**
- **అయోమయంలో ప్రజలు, వాహనదారులు**

: **గంభీరావుపేట:** గంభీరావుపేట–లింగన్నపేట మధ్య నిర్మాణంలో ఉన్న బ్రిడ్జికి మరోసారి ఆటంకం ఏర్పడింది. భారీ వర్షాలతో మానేరు వాగులోకి వరద నీరు భారీగా చేరడంతో వాగు ఉగ్రరూపం దాల్చింది. వరద ప్రవాహం ధాటికి బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో మట్టి రోడ్డు నీటిలో కొట్టుకుపోయింది. దీంతో గంభీరావుపేట–లింగన్నపేట మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**వాహనదారులకు తప్పని తిప్పలు..**

తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అత్యవసర పనుల కోసం ఇరువైపులా ప్రయాణించే ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

**నాల్గు ఏళ్లుగా కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణం..!**

గంభీరావుపేట–లింగన్నపేట ప్రాంత ప్రజలకు ఎంతో కీలకమైన ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రతి వర్షాకాలంలో ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక రోడ్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడటంతో వరదలు వచ్చిన ప్రతిసారీ రాకపోకలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. ప్రస్తుతం కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి రోడ్డును వెంటనే పునరుద్ధరించడంతో పాటు బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. మరోసారి వరదలు వచ్చినప్పుడు ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి

- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**
- **నేరడిగొండ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ**

: **నేరడిగొండ:** విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం నేరడిగొండ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీసు తమకు కేటాయించిన గ్రామాన్ని సందర్శిస్తూ సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. మండలంలో గంజాయి, గుడుంబా, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలని సూచించారు. ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి, త్వరితగతిన న్యాయం అందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, బ్లూ కోల్ట్, డయల్ 100, 112 విధులను పర్యవేక్షించాలని, రాత్రి గస్తీలో ఫింగర్ ప్రింట్ పరికరాలను వినియోగించాలని తెలిపారు. కుప్టి బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను త్వరితగతిన మరమ్మత్తు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్ రమేష్, ఎస్సై ఇమ్రాన్, సిబ్బంది పాల్గొన్నారు.



# మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

: **గంభీరావుపేట:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో గంభీరావుపేట మండలం గోరంటాల బీట్ పరిధిలోని గజసింగవరం శివారులో మంగళవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మెగా ప్లాంటేషన్‌లో భాగంగా 50వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడవులను సంరక్షించడంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. అడవులతోనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. అటవీ విస్తీర్ణం తగ్గిపోవడంతో వన్యప్రాణులు, పక్షుల మనుగడకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ సమస్యలను నివారించేందుకు విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. జిల్లాలో మొక్కలు నాటే లక్ష్యం 8,65,200 కాగా ఇప్పటివరకు 6,89,212 మొక్కలు నాటి 79.66 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. వనమహోత్సవంలో భాగంగా రెండు మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో ప్రతి ఇంటికి మూడు నుంచి ఐదు మొక్కలు పంపిణీ చేస్తామని, ప్రజలు వాటిని నాటి సంరక్షించాలని కోరారు. ముఖ్యంగా మునగ మొక్కలను నాటడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ప్రతి ఇంటికి అందించిన తడి, పొడి చెత్త బుట్టలను సద్వినియోగం చేసుకోవాలని, ఇంటి నుంచే చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో పర్యావరణానికి హాని కలగడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమురిశెట్టి విజయ, సర్పంచ్ లతిక, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

: **నేరడిగొండ:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నేరడిగొండ మండలం వాగ్ధారి గ్రామ సమీపంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా "మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. పచ్చని భవిష్యత్తును నిర్మిద్దాం" అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతిఒక్కరూ నైతిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కల సంరక్షణకు బాధ్యత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి అధికారి విశ్వనాథ్ బుస రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# అశపాలిలో పారిశుధ్య పనులు



: **జైనూర్:** మండలంలోని అశపాలి గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని మురుగు కాలువల్లో పేరుకు పోయిన చెత్త, మురికిని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చే పనులను సిబ్బంది చేపట్టారు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మరప రవికుమార్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో చెత్త వేయకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

# తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలి





- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు

: **మంచిర్యాల:** రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీట్ పీజీ పరీక్ష నిర్వహణ, పర్యాటక రంగ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని 27 గుర్తించిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యాటకులకు సులభమైన ప్రయాణం, వసతి, స్మార్ట్ పాస్‌లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, జీవనోపాధి అవకాశాలను పెంచాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, హస్తకళలు, వారసత్వ సంపదను సాంకేతిక పరిజ్ఞానంతో అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసి 'బ్రాండ్ తెలంగాణ'ను బలోపేతం చేయాలని తెలిపారు. పర్యావరణహిత పర్యాటకాన్ని ప్రోత్సహించేలా ఆధ్యాత్మిక, వారసత్వ, పర్యావరణ, హస్తకళల పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అలాగే నీట్ పీజీ పరీక్షను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 17,627 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించి ఎలక్ట్రానిక్, డిజిటల్ పరికరాలను అనుమతించరాదని సూచించారు. వర్షపాతం లోటు దృష్ట్యా మండలాల వారీగా సాగు విస్తీర్ణం, నీటి లభ్యత, రిజర్వాయర్ల నీటిమట్టాలను పర్యవేక్షించాలని తెలిపారు. రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అన్నారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ, కందులు, పెసలు, మినుములు, సోయాబీన్, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర పంటలను ప్రాంతానుకూలంగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యాటక రంగ అభివృద్ధి, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, జిల్లా క్రీడా యువజన సేవల అధికారి హనుమంత రెడ్డి, జిల్లా మాధ్యమిక విద్యాధికారి అంజయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం వైపు అడుగు.. భవిష్యత్ తరాల కోసం బాధ్యత

## వనమహోత్సవంలో మొక్కలు నాటిన ఎస్పీ రాజేష్ చంద్ర



: **కామారెడ్డి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా కామారెడ్డి జిల్లాలో ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర స్వయంగా మొక్కలు నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. "మొక్క నాటడం మాత్రమే కాదు.. దానిని సంరక్షించడం కూడా మన బాధ్యత" అని పేర్కొన్నారు. వనమహోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేస్తే పచ్చని కామారెడ్డిని నిర్మించవచ్చని తెలిపారు. మొక్కలను సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ నర్సింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ ఉదయ భాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్, కృష్ణ, ఆర్ఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చీటింగ్, దొంగతనం, అటెన్షన్ డైవర్షన్ కేసులో నిందితుడి అరెస్ట్

- ఫోన్‌పే ద్వారా రూ.17 వేల నగదు బదిలీ చేసిన నిందితుడు
- ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి



: **ఆదిలాబాద్:** ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటో డ్రైవర్‌ను మాటల్లో పెట్టి, అతని మొబైల్ ఫోన్‌ను తీసుకుని ఫోన్‌పే ద్వారా రూ.17వేల నగదును తన ఖాతాకు బదిలీ చేసుకుని మోసానికి పాల్పడిన నిందితుడిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదిలాబాద్ డిఎస్పి ఎల్.జీవన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌లోని బొక్కల గూడకు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ హాది ఈనెల 21న ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో నడుపుతుండగా, ఓ మహిళ, ఆమె కుమారుడు ఖండాల గ్రామానికి వెళ్లేందుకు ఆటోను అద్దెకు తీసుకున్నారు. మహిళను ఖండాల వద్ద దించిన అనంతరం ఆమెతో వచ్చిన వ్యక్తి మరో ప్రాంతానికి వెళ్లాలని కోరగా, ఆటో డ్రైవర్ రూ.2వేలు ఛార్జీగా చెప్పడంతో అతను అంగీకరించాడు. ఆదిలాబాద్ క్రాస్‌రోడ్స్ వద్దకు చేరుకున్న సమయంలో తన ఫోన్ స్విచ్ ఆఫ్ అయిందంటూ ఆటో డ్రైవర్ మొబైల్ ఫోన్‌ను తీసుకుని ఫోన్ చేసినట్లు నటించాడు. అనంతరం నిందితుడు ఆటో డ్రైవర్‌కు తెలియకుండా అతని ఫోన్‌లోని ఫోన్‌పే ద్వారా రూ.17వేలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. మరుసటి రోజు ఫోన్‌పే లావాదేవీలను పరిశీలించిన ఆటో డ్రైవర్ విషయం గుర్తించి సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చిచ్‌ధరి ఖానాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు రాథోడ్ యువరాజ్ ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.10వేల నగదు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో కూడా 8 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన టూటౌన్ పోలీసులను డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ నాగరాజు, ఎస్సైలు అఖిల్, ప్రణయ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధ్వానంగా కెరమెరి ఘాట్ రహదారి

## వాహనదారులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

: **జైనూర్:** కెరమెరి ఘాట్ రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రహదారిపై మట్టి, బురద, రాళ్లు పేరుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఘాట్ రహదారిలో పలుచోట్ల రహదారి పక్క భాగాలు పూర్తిగా దెబ్బతినడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు కూడా నెమ్మదిగా ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు కురిసే సమయంలో రహదారి పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించే ప్రజలకు కూడా ఈ రహదారి తీవ్ర ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే ఘాట్ రహదారిని పరిశీలించి, రహదారిపై పేరుకుపోయిన మట్టి, రాళ్లను తొలగించడంతో పాటు దెబ్బతిన్న ప్రాంతాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

# భూ సేకరణలో పరిహారం చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలి

- అర్హులైన భూ యజమానులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించాలి
- రాష్ట్ర నీటిపారుదల, ఆహార-పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి





: **మంచిర్యాల:** సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా చేపడుతున్న భూ సేకరణకు సంబంధించి పరిహారం చెల్లింపు ప్రక్రియను సమర్థవంతంగా, వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార–పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ అనుమతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమలులో ఉన్న నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ సేకరణ పరిహారం పొందేందుకు అర్హులైన వారి జాబితాలను జిల్లాల వారీగా సిద్ధం చేయాలని సూచించారు. అర్హత కలిగిన భూ నిర్వాసితులు, భూ యజమానులకు పరిహారం చెల్లింపులను నిబంధనల ప్రకారం త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఇంజినీరింగ్, రెవెన్యూ, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ ఏడాది భూ సేకరణ పరిహారం చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.6వేల కోట్ల నిధులను విడుదల చేయనుందని, అర్హత కలిగిన కేసులను గుర్తించి అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి కేసుకు టోకెన్ నంబర్ జనరేట్ చేసి, పరిహారం చెల్లింపుల ప్రక్రియను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించాలన్నారు. పరిహారం చెల్లింపులు, అర్హత నిర్ధారణ లేనియెడల సాంకేతిక, పరిపాలనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులు ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించి వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు. పీడీ ఖాతాల్లో ఉన్న నిధులను అర్హులైన భూ యజమానులకు వెంటనే చెల్లించాలని ఆదేశించారు. భూసేకరణ, ఆర్అండ్ఆర్, అటవీ భూములకు సంబంధించిన పెండింగ్ అంశాలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి అభివృద్ధి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాల వారీగా భూసేకరణ పురోగతి, పరిహారం చెల్లింపులు, ఆర్అండ్ఆర్ చర్యలు, అటవీ భూములకు సంబంధించిన అనుమతులు, పెండింగ్ సమస్యలను సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణంలో భాగంగా సేకరించిన భూముల యజమానులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించడంతో పాటు అటవీ శాఖకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, భూసేకరణ, నీటిపారుదల శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఎమ్మెల్సీ దండే విఠల్

: **బెజ్జూర్:** కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత



బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఎమ్మెల్సీ దండే విఠల్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేసేందుకు చేపట్టిన సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా మంగళవారం బెజ్జూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షురాలు పంద్రం పుష్పలత అధ్యక్షతన జరిగిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. మండల, గ్రామ, బూత్ స్థాయిల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఐక్యంగా పనిచేస్తే బెజ్జూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలమైన శక్తిగా ఎదుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనాన్ని కాపాడటంతోనే సమతుల్య వాతావరణం

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




: **మంచిర్యాల:** మొక్కలు నాటి వాటిని సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమతుల్య వాతావరణాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మందమర్రి మండలం బొక్కలగుట్ట ప్రాంతంలోని గాంధారి వనంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఎంపీడీఓ రాజేశ్వర్‌లతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్ల ద్వారా సహజ వాయువు, ఆరోగ్యకరమైన ఆహారం, ఆశ్రయం లభించడంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలో 4లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. జిల్లాకు నిర్దేశించిన 41లక్షల మొక్కల లక్ష్యంలో దాదాపు 80 శాతం పూర్తి చేసినట్లు వివరించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి క్కరూ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మందమర్రి మండల కేంద్రంలోని ఆర్‌కె.గార్డెన్స్‌లో నిర్వహించిన రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారుల లక్కీడ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా ఇళ్లు కేటాయించేందుకు లక్కీ డ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇళ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, తహశీల్దార్ సతీష్ కుమార్, ఇందిరమ్మ ఇళ్ల పీడీ బన్సీలాల్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పూలాజీ బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



: **ఆసిఫాబాద్:** సద్గురు పూలాజీ బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జయంతి వేడుకల ఆహ్వాన కమిటీ ప్రతినిధులతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30న జిల్లాలోని జైనూర్ మండలం పట్నాపూర్‌లో శ్రీ శ్రీ శ్రీ సద్గురు పూలాజీ బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలాజీ బాబా సంస్థాన్ ట్రస్ట్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్, సభ్యులు విష్ణు, కైలాష్, నారాయణ, ఆహ్వాన కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# తెలంగాణ పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు**

**వికారాబాద్, :** రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీట్ పరీక్ష నిర్వహణ, పర్యాటక రంగ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు సులభమైన ప్రయాణాలు, వసతి, స్మార్ట్ పాస్‌లు ఇతర సౌకర్యాలు కల్పించి 27 గుర్తించిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, జీవనోపాధి కల్పించేందుకు స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, హస్తకళలు, వారసత్వ సంపదను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేస్తూ బ్రాండ్ తెలంగాణను బలోపేతం చేయాలని తెలిపారు. పర్యావరణహిత పర్యాటకం లక్ష్యంగా ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను




అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, ఇందులో పర్యాటక ప్రాంతాల వర్గీకరణ చేసి ఆధ్యాత్మిక, వారసత్వ, పరిసరాల ఇకో, హస్తకళల పర్యాటకంగా గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నీట్ పి.జి.– 2026 పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. పరీక్షకు సంబంధించి 14 జిల్లాలలో 56 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా మొత్తం 17 వేల 627 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, పరీక్షను పారదర్శకంగా, సురక్షితంగా నిర్వహించేందుకు బహుళస్థాయి పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి 12 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్, సుమారు 3 వేల మంది ఎన్.బి.ఈ.ఎం.ఎస్. అబ్జైజర్లు, సోషల్ మీడియా మానిటరింగ్, 600 మంది ఫ్లయింగ్ స్క్వాడ్లు, 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్ల ద్వారా పర్యవేక్షణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రశ్నపత్రాల భద్రతకు ఆర్.ఎస్.ఎ. ఎన్‌క్రిప్షన్ విధానాన్ని వినియోగిస్తున్నామని, పరీక్షకు 60 నిమిషాల ముందు వి.పి.ఎన్. ద్వారా ప్రశ్నపత్రాన్ని అప్‌లోడ్ చేసి, పరీక్షకు 30 నిమిషాల ముందు పాస్‌వర్డ్ విడుదల చేయడంతో పాటు, అభ్యర్థి లాగిన్ అయిన తర్వాత మాత్రమే ప్రశ్నపత్రాన్ని డీక్రిప్ట్ చేసే విధానం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పరిశీలన చర్యలు చేపట్టి ఎ.ఐ. గ్లాసెస్, బ్లూటూత్ ఇయర్‌పీస్‌లు, స్పై కెమెరాలు, ఇతర డిజిటల్ పరికరాలను అనుమతించరాదని, అవసరమైన చోట స్థానిక పోలీసుల సహకారంతో ప్రవేశ నియంత్రణ చేపట్టాలని, పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న వానాకాలం, ఖరీఫ్ సీజన్‌లో లోటు వర్షపాతం దృష్ట్యా సాగు విస్తీర్ణం, నీటి లభ్యత, రిజర్వాయర్ల నీటిమట్టాలు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ మండలాల వారీగా వ్యవసాయ పరిస్థితులను అంచనా వేయాలని సూచించారు. రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా సూచనలు ఇస్తూ, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణను చేపట్టేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న, జొన్న, వేరుశెనగ, కందులు, పెసలు, మినుములు, సోయాబీన్, కూరగాయలు, ఆయిల్‌పామ్ తదితర ప్రత్యామ్నాయ పంటలను ప్రాంతానుకూలంగా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పర్యాటక రంగ అభివృద్ధి, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వ్యవసాయ శాఖ అధికారి కవిత,సి పి ఓవెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నీరు పేద రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- **తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్వాసితుల ధర్నా**
- **భూమి పోయింది.. నష్టపరిహారం రాలేదు – ఆవేదనలో రైతులు**

**ఖమ్మం :** సీతారామ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన నీరు పేద రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం రైతుల భూములను వినియోగించుకున్నప్పటికీ, పలువురు రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని కోల్పోయి జీవనాధారం దెబ్బతిన్నా అధికారులు నష్టపరిహారం చెల్లించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. ఈ ధర్నాకు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, బీఆర్ఎస్, ఎంఎస్ఎఫ్, బీఎస్పీ నాయకులు మద్దతు ప్రకటించి నిర్వాసిత రైతులకు



అండగా నిలిచారు.ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం ( AIKMS) రాష్ట్ర నాయకులు మందుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులందరికీ ప్రభుత్వం న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర భూ రికార్డులు ఉన్నప్పటికీ నష్టపరిహారం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.అధికారులు వెంటనే గ్రామాల వారీగా భూముల వివరాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని గుర్తించి అర్హులైన రైతులందరికీ తక్షణమే చెల్లించాలని కోరారు. రైతుల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తే నిర్వాసిత రైతులతో కలిసి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. భూములు కోల్పోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ నాయకులు న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కొర్రపాటి రమేష్ ఎంఎస్ఎఫ్ మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు నాగభూషణం టిఆర్ఎస్ మండల నాయకులు గంటా కృష్ణ బీఎస్పీ పాలేరు నియోజకవర్గ నాయకులు ఎన్నబోయిన రమేష్ కొమ్ము పూలే బాధితులు నరసయ్య దాసు రంజిత్ ఉపేందర్ భారతమ్మ వెంకటలక్ష్మి ఉప్పలమ్మ రమేష్ యశోద ఎల్లమ్మ సునీత పూలమ్మ చిన్న గురవయ్య తదితరులు పాల్గొన్నారు

## రేగా కాంతారావు వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల తీవ్ర ఆగ్రహం

**ముఖ్యమంత్రి, ఎంపీలపై విమర్శలు చేస్తే సహించేది లేదు: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్**

**ఆళ్లపల్లి,25/8/26 :** మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై చేస్తున్న విమర్శలపై ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా స్పందించాయి. మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రేగా కాంతారావు రాజకీయ వైఖరిని తప్పుబట్టారు.కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా ఎదిగి గుర్తింపు పొందిన రేగా కాంతారావు అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరి, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్యమంత్రి, ఎంపీలపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వాసం శ్రీకాంత్ అన్నారు. రాజకీయ స్వార్థంతో పార్టీలు మారుతూ ఇప్పుడు కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు.



**కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు లేదు**

కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ గుర్తింపు పొందిన రేగా కాంతారావుకు ప్రస్తుతం అదే పార్టీ నాయకత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని శ్రీకాంత్ అన్నారు. రాజకీయ విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం మాత్రం సమంజసం కాదని సూచించారు.

**హద్దులు దాటితే తగిన సమాధానం**

కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి మరియు ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఇకనైనా మానుకోవాలని శ్రీకాంత్ హెచ్చరించారు. కాంగ్రెస్ కార్యకర్తల సహనాన్ని పరీక్షించవద్దని, నాయకులపై విమర్శలు చేసే విషయంలో నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలకే పరిమితం కావడం సరికాదని, ప్రజల కోసం పనిచేసే నాయకులపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. రేగా కాంతారావు తన వైఖరిని మార్చుకోకపోతే కాంగ్రెస్ శ్రేణులు రాజకీయంగా తగిన రీతిలో సమాధానం చెబుతాయని స్పష్టం చేశారు.

## గుత్తికోయ కుటుంబాలకు దోమతెరలు, సోలార్ దీపాల పంపిణీ

**ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో మారుమూల గిరిజన కుటుంబాలకు చేయూత**

**ఆళ్లపల్లి, :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గుత్తికోయ కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు. కరకగూడెం మండలానికి చెందిన పాషా సహకారంతో, ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద వెంకటాపురం గ్రామ పరిధిలోని దేవయ్య గుంపు, పాల గుంపు, రాళ్ల గుంపుల్లో నివసిస్తున్న 43 గుత్తికోయ కుటుంబాలకు దోమతెరలు, సోలార్ విద్యుత్ దీపాలను పంపిణీ చేశారు.మారుమూల అటవీ ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం సరిగా అందుబాటులో లేని గిరిజన కుటుంబాలకు సోలార్ దీపాలు ఎంతగానో ఉపయోగపడతాయని, రాత్రి వేళల్లో వెలుతురు కోసం ఇబ్బందులు పడకుండా ఇవి సహాయపడతాయని నిర్వాహకులు తెలిపారు. చిన్నారులు చదువుకోవడానికి, వృద్ధులు రాత్రి సమయంలో సురక్షితంగా



ఉండేందుకు సోలార్ దీపాలు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా గిరిజన కుటుంబాలకు దోమతెరలు పంపిణీ చేయడం ద్వారా దోమల బెడద నుంచి రక్షణ కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు కూడా కొంతమేర ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాల అవసరాలను గుర్తించి వారికి నిత్యావసర సహాయాన్ని అందించడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరకగూడెం మండలానికి చెందిన పాషా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గుత్తికోయ కుటుంబాలకు తమవంతు సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై సోమేశ్వరరావు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల భద్రతతో పాటు వారి సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల్లో కూడా భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గిరిజన కుటుంబాల సంక్షేమం కోసం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు ప్రజలకు పోలీసులపై మరింత నమ్మకం, భరోసా కల్పిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై సోమేశ్వరరావుతో పాటు పోలీసు సిబ్బంది, పాషా, స్థానికులు, గుత్తికోయ కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ కాలభైరవ స్వామి కి ఘనంగా సింధూర పూజలు

**రామారెడ్డి :** రామారెడ్డి మండలం ఈసనపల్లి (రామారెడ్డి) గ్రామలలో వెలిసిన శ్రీ కాలభైరవ స్వామికి మంగళవారం రోజున, ఘనంగా సింధూర పూజలు నిర్వహించారు , ధూప దీప నైవేద్యాలతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు పూజారులు అభిషేకాలు,నిర్వహించారు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు, ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభు రామచంద్రం, ఆలయ చైర్మన్ చింతల శంకర్, డైరెక్టర్లు, అసిస్టెంట్ ఈవో లక్ష్మణ్, పంతులు శ్రీనివాస్ శర్మ, వంశీ శర్మ , నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



## వై ఆర్ జి కేర్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవిపై అవగాహన ర్యాలీ




**ఖమ్మం :** తిరుమలాయపాలెం మండలం లో బీరోలు గ్రామంలోని వై ఆర్ జి కేర్ సంస్థ ఆధ్వర్యంలో పై హెచ్ఐవిఅవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుమ్మడి దేవభిక్షం, వై ఆర్ జి కేర్ సంస్థ సూపర్వైజర్ కర్లకుంట నరేష్ మాట్లాడుతూ హెచ్ఐవి ,సుఖ వ్యాధులు, టిబి వ్యాధులు వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించడం జరిగింది .18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క వ్యక్తి సంవత్సరానికి ఒక్కసారైనా హెచ్ఐవి టెస్ట్ చేయించుకోవాలని చెప్పడం జరిగింది హెచ్ఐవి అంటువ్యాధి కాదని చెప్పడం జరిగింది హెచ్ఐవి సోకిన వారి పట్ల వివక్షత భావం లేకుండా చూడాలని వారిని కూడా గౌరవించాలని చెప్పడం జరిగింది ఏఆర్టి మందులు హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం సమక్షేమ పథకాలు అనగా ఆసరా పెన్షన్ వంటి వాటి గురించి చెప్పటం జరిగింది. గ్రామ సర్పంచ్ దేవభిక్షం మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పడం జరిగింది ప్రధానోపాధ్యాయులు వీర స్వామి ఎంపీహెచ్ఏ ఎం పద్మ మాట్లాడుతూ హెచ్ఐవి నివారణలో అందరూ భాగస్వాములు కావాలని ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని విద్యార్థులు గ్రామ ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని జాగ్రత్త పాటించాలని చెప్పడం జరిగింది కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మౌనిక, గ్రామ దీపిక మాధురి, ఏ ఎన్ ఎం, ఉపాధ్యాయులు అన్వర్ పాషా, వెంకటేశ్వర్లు వై. ఆర్ జి కేర్ సంస్థ లింక్ వర్కర్ ఉషారాణి, ఆశా వర్కర్స్ ఊర్మిళ సరిత రేణుక మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అజయ్ తండాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఖమ్మం :** నేలకొండపల్లి, పాలేరు నియోజకవర్గం, నేలకొండపల్లి మండలం అజయ్ తండా గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ తేజావత్ శివాజీ చేతుల మీదుగా లబ్ధిదారులకు నూతన స్మార్ట్ కార్డులను అందజేశారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయని, స్మార్ట్ రేషన్ కార్డులతో పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జి పి ఓ జాన్మియా, ఉప సర్పంచ్ తేజావత్ పూల్ సింగ్, గ్రామ పెద్దలు తేజావత్ నరేష్, తేజావత్ పుష్య, మాలో సక్రు, వార్డు సభ్యులు తేజావత్ రామ్మోహన్ రావు, బానోత్ సుశీల, బానోత్ భాషా, బానోత్ ధనమ్మ, తేజావత్ కోటమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ బానోత్ వెంకటేశ్వర్లు, గ్రామ దీపిక బానోత్ కవిత, వి ఓ అధ్యక్షురాలు భూక్య సక్కుబాయి, డీలర్ బానోత్ తులసీరామ్, సిబ్బంది బానోత్ నాగేశ్వరరావు, మహిళలు, గ్రామ ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మిలాద్-ఉన్-నబీ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతి కమిటీ సమావేశాలు

**వికారాబాద్, :** మిలాద్–ఉన్–నబీ పండుగ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణకు




తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు జారీ చేశారు. పండుగలు, ఊరేగింపులు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, అన్ని వర్గాల ప్రజలతో సమన్వయం చేసుకుంటూ శాంతి, సామరస్యాన్ని కాపాడాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. సున్నితమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

**జిల్లా వ్యాప్తంగా శాంతి కమిటీ సమావేశాలు**

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు మిలాద్–ఉన్–నబీ పండుగ, ఊరేగింపుల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. వికారాబాద్, పరిగి, తాండూర్, మోమిన్‌పేట్, నవాబుపేట్, కొట్ పల్లి, కుల్కచర్ల, దోమ, ధారూర్, కొడంగల్, కరణ్‌కోట్, చెంగోముల్, బొంరాస్‌పేట్, పెద్దేముల్, దుద్యాల్, బంట్వారం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో వివిధ వర్గాల పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పండుగ నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మిలాద్–ఉన్–నబీ వేడుకలను ప్రశాంతమైన, సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ఊరేగింపులు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలను పోలీసుల సూచనలు, నిబంధనలు, నియమావళి, నిర్దేశించిన సమయాలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు.అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించుకుంటూ సంయమనం, సోదరభావంతో వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని, సోషల్ మీడియాలో పుకార్లు, అభ్యంతరకరమైన లేదా రెచ్చగొట్టే సమాచారాన్ని ప్రచారం చేయవద్దని పోలీసులు ప్రజలకు స్పష్టం చేశారు. మిలాద్–ఉన్–నబీ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని శాంతి కమిటీ సభ్యులు, మత పెద్దలు, పండుగ నిర్వాహకులు పోలీసులకు హామీ ఇచ్చారు.



# బహుముఖ ప్రజ్ఞాశాలి ఏల్చూరి

## నేడ ఏల్చూరి సుబ్రహ్మణ్యం జయంతి

**ఏల్చూరి సుబ్రహ్మణ్యం (ఆగష్టు 26, 1920 - ఫిబ్రవరి 25, 1995) ప్రసిద్ధ కవి, రచయిత, పాత్రి కేయులు. సహజ కవిగా, గొప్ప వక్తగా, ఉద్యమ ప్రవక్తగా, ప్రగతి శీల భావుకునిగా, తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు. ఆయన తెలుగు సాహిత్యంలో ప్రాముఖ్యత వహించిన అభ్యుదయ కవిత్వో ద్యమ ఆద్యుల్లో ఒకరు. అభ్యుద య కవితా యుగంలో ప్రగతి శీల భావ దురంధరులైన బెల్లం కొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయు లుతో కూడి, ఏల్చూరి సుబ్రహ్మ ణ్యం వెలువరించిన తొలి కావ్యం నయా గరా కవితల సంపుటి. అలా ముగ్గురు అభ్యు దయ నయాగరా కవులలో ఏల్చూరి ఒకరుగా నిలిచారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు.**

ఏల్చూరి సుబ్రహ్మణ్యం ఆగష్టు 25, 1920న రామయ్య. సుబ్బాయమ్మ దంపతులకు జన్మించారు. మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ, భాగవతుల వెంకట సుబ్బారావు, అక్కిరాజు రామాపతి రావు, నాయని సుబ్బారావు తదితరుల వద్ద చిన్ననాడు విద్యా బుద్ధులు నేర్చారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లోనే ఉండి, విజయవాడ యస్.ఆర్.ఆర్ కళాశాలలో బి.ఎ. డిగ్రీ చేశారు. కవి సామ్రాట్ శిష్యుడు అయిన నందమూరి తారక రామారావు తో చిన్ననాటి నుండి స్నేహం ఉంది. అలాగే కొంగర జగ్గయ్య, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ప్రాణ స్నేహితుల్లా మెదిలారు. కుందుర్తి ఆంజనే యులు, బెల్లంకొండ రామ దాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురు విద్యార్థి దశలో చదువుతున్న రోజులలో పరిచయ-స్తులై, తరువాతి కాలంలో "నయాగరా" కవితా సంకలనం సమ కూర్పుకు కారకులు అయినారు. .'త్రివేణి' ఆంగ్లపత్రిక సంపాదకులు కోలవెన్ను రామకోటేశ్వరరావు, దేశిరాజు కృష్ణశర్మ, బెల్లంకొండ రాఘవరావు, గుడిపాటి వెంకట చలం, గుఱ్ఱం జాషువాల స్ఫూర్తిని పొంది, పులుపుల శివయ్య, కొల్లా వెంకయ్యల వల్ల కమ్యూనిస్టు ఉద్య మంలో కాలూనారు. 1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అన్న పత్రికను స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, దండమూడి కేశవరావు, బెల్లంకొండ రామదాసు, దేవరకొండ బాలగంగాధర తిలక్ మొదలైన కవుల తొలి రచనలను ఆ పత్రికలో ప్రచురించారు. అదే సంవత్సరంలో 'చిత్ర' అనే పత్రికను ప్రారంభిం చారు. 1941 లో నవ్యకళా పరి షత్తును స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు, సముద్రాల రామానుజాచార్య, దేవరకొండ బాల గంగాధర తిలక్, రెంటాల గోపాలకృష్ణ మొదలైన అభ్యుదయ కవులు సభ్యులుగా కొనసాగారు. అలా ఆయా కవుల రచనలతో 1943 లో 'మాఘ్యమాల' కవితా సంపుటాన్ని వెలువరించారు. శ్రీశ్రీ కవిత్వ ప్రభావ స్ఫూర్తితో 1944 ఆగస్టులో బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురి కృషితో కవితా సంకలనం 'నయాగరా' వెలువడి అభ్యుదయ సాహిత్యోద్య మంలో అచ్చయిన తొలి కవితా సంపుటంగా నిలిచి పోయింది. అనిసెట్టి సుబ్బారావు, లక్ష్మీదేవిల పెళ్ళి కానుకగా గుంటూరులో విశ్వనాథ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కృతం అయింది. నయాగర కవితా సంకలనంలో బెల్లంకొండ, ఏల్చూరి, కుందుర్తి ఒక్కొక్కరూ మూడేసి ఖండ కావ్యాలను రచించి 9 ఖండ కావ్యాల సంకలనంగా ప్రచురిం చారు. ఈ సంకలనంలో ...కుందుర్తి ఆంజనేయులు మూడు రచనలు... జయిస్తుంది, తరువాత, మన్యంలో; బెల్లంకొండ రామదాసువి... చెరసాల, నా గీతం, ఈ రోజున; అలాగే ఏల్చూరి సుబ్రహ్మణ్యం సంబంధిత....ప్రజాశక్తి, ఠాగూర్ చంద్ర సింగ్, విజయ ముద్ర ఖండ కావ్యాలు చేర్చ బడ్డాయి. 1956 లో తెలుగు సాహిత్యంలో ఏల్చూరి తొలి దీర్ఘ కవిత 'నవంబరు 7' విశాలాంధ్ర పత్రికలో వెలువడింది. తల్లావఝుల శివశంకర శాస్త్రి తో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఏల్చూరి నవ్య సాహిత్య పరిషత్తు సభ్యునిగా చేరి, సమావే శాలకు హాజరయ్యారు. ప్రగతిశీల ఉద్యమాలలో పాల్గొ న్నారు. వందలాది రష్యన్ కవితలను ఆంగ్ల మాధ్యమం ద్వారా అనువదించారు. నృసింహ స్వామి పై శతకం కూడా రాశారు. శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర, అబ్బూరి వరదరాజేశ్వర రావు సంయుక్తంగా రాసిన "మేమే" కావ్యాన్ని సుబ్రహ్మణ్యంకు అంకితం ఇవ్వడం విశేషం. ఆంగ్లంలో వచ్చిన వందలాది రష్యన్ కవితలను తెలుగులోకి అనువదించారు. సోవియట్ భూమి పత్రికలో సుమారు 40వేల పేజీల అనువాద రచన చేశారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతుంది. అభ్యు దయ కవిగా, అంతకు మించి కృషి పాత్రికేయుడిగా ఆయన చేసిన కృషి సాటిలేనిది. 1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అనే పత్రికను స్థాపించి, ప్రముఖ కవుల రచనలు ప్రచురిం చారు. పొగాకు లోకం' (గుంటూరు) పత్రిక సంపాదకులుగా, 1941 - 42లో ఆంధ్ర సర్వస్వము సహాయ సంపాదకునిగా, 1954-56లో ఆకాశ వాణిలో స్క్రిప్టు రైటరుగా... రాయప్రోలు రాజశేఖర్, జలసూత్రం రుక్మిణనాథశాస్త్రి లతో కలిసి ఆకాశవాణికి ఎన్నో స్క్రిప్ట్ లందించారు. మద్రాస్‌లో సినిమా లకు పాటలు కూడా రాశారు. 1952లో సోషలిస్టు పత్రికలో, 1956లోనేత' పత్రిక సంపాద కులుగా, 1961-1988లో సోవియ ట్ భూమి పత్రిక సంపాదక వర్గంలో, తర్వాత మద్రాసులో అభ్యుదయ పత్రిక నిర్వాహకసభ్యునిగా పని చేశారు.ప్రముఖ వేణుగాన విద్వాంసులు ఏల్చూరి విజయ రాఘవరావు ఆయన సోదరులు కాగా, సాహితీవేత్త ఏల్చూరి మురళీధరరావు ఆయన కుమారుడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ప్రేమ సామ్రాజ్ఞి... సేవా తపస్విని మదర్ థెరిసా



### ఆధునిక శాంతిదూత మదర్ థెరిసా • నేడు మదర్ థెరిసా జయంతి

**మానవ సేవకు మతం, జాతి, కులం, వర్గం, సరిహద్దులు అడ్డంకి కావని తన జీవితాచరణ ద్వారా జగతికి చాటిచెప్పిన కరుణామూర్తి, సేవా శిఖరం మదర్ థెరిసా. ఆధునిక మానవ సమాజంలో స్వార్థం, భోగలాలసత రాజ్యమేలుతున్న తరుణంలో, నిస్వార్థ ప్రేమకు, అపరిమిత త్యాగానికి సజీవ ప్రతిరూపంగా నిలిచిన ధన్యజీవి ఆమె. తెలుగు ప్రాచీన సూక్తి "పరోపకారార్థమిదం శరీరం" అన్న మాటకు, వేమన యోగి ప్రబోధించిన "ఉపకారమే మానవ ధర్మము" అన్న తాత్విక సత్యానికి, మహాకవి గురజాడ అప్పారావు గళమెత్తిన "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్న విశ్వ మానవతా దృక్పథానికి మదర్ థెరిసా జీవితం ఒక నిలువెత్తు నిదర్శనమై భాసిల్లింది.**

ఆమె అసలు పేరు అగ్నెస్ గోంజా బొజాక్షియు. 1910 ఆగస్టు 26న నాటి ఒట్టోమన్ సామ్రాజ్య పరిధిలోని స్కోప్జే నగరంలో (ప్రస్తుత ఉత్తర మాసిడోనియా) అల్బేనియన్ దంపతులైన నికోలా బొజాక్షియు, డ్రానే దంపతులకు జన్మించారు. చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో తల్లి పెంచిన క్రమశిక్షణ, పేదలకు సాయం చేసే విశాల గుణం బాల్యం నుంచే ఆమెలో ఆధ్యాత్మిక బీజాలు నాటాయి. పన్నెండేళ్ల చిరు ప్రాయంలోనే సేవా దీక్ష వైపు మనసు మళ్లగా, పద్దెనిమిదేళ్ల వయసులో 1928లో ఐర్లాండ్‌లోని 'సిస్టర్స్ ఆఫ్ లోరెటో' సంస్థలో చేరి సన్యాసినిగా మారారు. అనంతరం 1929 జనవరిలో భారతదేశ తీరానికి చేరుకొని, 1931 మే 24న తొలి సన్యాస ప్రమాణాలు స్వీకరిస్తూ 'థెరిసా' అన్న నామకరణం చేసుకున్నారు. కోల్‌కతాలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో దాదాపు రెండు దశాబ్దాల పాటు ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా భూగోళ శాస్త్రం, చరిత్రను బోధిస్తూ ఉన్నత విద్యాసేవలందించారు.

**పాఠశాల నాలుగు గోడల మధ్య సుఖవంతమైన జీవితం ఉన్నప్పటికీ, వెలుపల వీధుల్లో రాజ్యమేలుతున్న దారిద్ర్యం, 1943 నాటి భయంకరమైన బెంగాల్ కరవు, 1946 నాటి రక్తసిక్తమైన హిందూ-ముస్లిం మతకల్లోలాల తీవ్రత ఆమె హృదయాన్ని తీవ్రంగా కలచి వేశాయి. 1946 సెప్టెంబర్ 10న డార్జిలింగ్‌కు రైలు ప్రయాణం చేస్తున్న సమయంలో ఆమెకు అంతరాత్మ నుంచి "పిలుపులో మరో పిలుపు" వినిపించింది. సురక్షితమైన కాన్వెంట్ గోడలను వీడి, అత్యంత నిరుపేదలు, అనాథలు, అభాగ్యుల మధ్య నివసిస్తూ వారి సేవకే జీవితాన్ని అంకితం చేయాలనే ఆత్మప్రబోధం కలిగింది. 1948లో వాటికన్ అనుమతితో నీలి అంచుగల తెల్లటి నూలు చీరను ధరించి, కేవలం ఐదు రూపాయల చిల్లరతో కోల్‌కతా మురికి వాడల్లోకి నిస్సహాయురాలిగా అడుగు పెట్టారు. పాట్నాలోని హోలీ ఫ్యామిలీ ఆసుపత్రిలో ప్రాథమిక వైద్య శిక్షణ పొందిన అనంతరం, మోతిఝిల్ మురికివాడలో చెట్ల కింద పేద పిల్లలకు అక్షరజ్ఞానాన్ని నేర్పడంతో ఆమె మహోన్నత సేవా యాత్ర ప్రారంభమైంది.**



1950 అక్టోబర్ 7న వాటికన్ అధికారిక ఆమోదంతో 'మిషనరీస్ ఆఫ్ చారిటీ' అనే సేవా సంస్థను స్థాపించడం ప్రపంచ సేవా చరిత్రలోనే ఒక గొప్ప మలుపు. సమాజం ఛీత్కరించిన కుష్ఠు వ్యాధిగ్రస్తులు, మురుగు కాలువల పక్కన చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అనాథల కోసం 1952లో కాళీఘాట్ సమీపంలో 'నిర్మల్ హృదయ్' (హోమ్ ఫర్ ది డయింగ్ డెస్టిట్యూట్స్) కేంద్రాన్ని నెలకొల్పారు. కనీసం బతికినంత కాలం ప్రేమకు నోచుకోని మనిషి, చివరి క్షణాల్లోనైనా మానవతా స్పర్శతో, గౌరవప్రదంగా కన్ను మూయాలన్నదే ఆమె ప్రధాన ఆశయం. అనంతరం అనాథ శిశువుల కోసం 'నిర్మలా శిశు భవన్', కుష్ఠు వ్యాధిగ్రస్తుల స్వయం ఉపాధి, పునరావాసం కోసం అసన్సోల్‌లో 'శాంతి నగర్' వంటి ఎన్నో ఆశ్రమాలను నిర్మించారు. 1963లో మిషనరీస్ ఆఫ్ చారిటీ బ్రదర్స్ విభాగం, తదనంతరం వాలంటీర్ల విభాగాలు విస్తరించాయి. 1965లో పోప్ పాల్ 6 ఆమె సేవలకు అంతర్జాతీయ హోదా కల్పించడంతో ఈ కరుణా తరంగాలు ప్రపంచ దేశాలన్నింటికీ వ్యాపించాయి. ఆమె జీవించి ఉన్న కాలంలోనే 120కి పైగా దేశాలలో 600కు పైగా కేంద్రాలు, దాదాపు 4,000 మందికి పైగా సన్యాసినులు నిరంతర సేవల్లో నిమగ్నమయ్యారు.

**ఈ అద్వితీయ త్యాగానికి ప్రపంచం వినమ్రంగా జోహార్లు అర్పించింది. భారత ప్రభుత్వం 1962లో పద్మశ్రీ, 1980లో అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించింది. అంతర్జాతీయంగా 1972లో జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ అవగాహన పురస్కారం, 1978లో బాల్జాన్ ప్రైజ్, అమెరికా ఇచ్చే అత్యున్నత ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్, పద్మవిభూషణ్ వంటి లెక్కలేనన్ని గౌరవాలు దక్కాయి. 1979లో ఆమెకు ప్రపంచ శాంతికి చేసిన విశేష సేవలకు గాను ప్రతిష్ఠాత్మక 'నోబెల్ శాంతి బహుమతి' లభించింది. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన విందును రద్దు చేయించి, ఆ మొత్తాన్ని పేదల ఆకలి తీర్చడానికే వెచ్చించమనడం ఆమె నిస్వార్థ నిబద్ధతకు నిదర్శనం. ఒక చారిత్రక వ్యక్తిగా ఆమె నిర్వహించిన ఆశ్రమాల్లోని వైద్య పరికరాల నాణ్యత, నొప్పి నివారణ మందుల కొరత, సాంప్రదాయ మతపరమైన భావనలపై క్రిస్టోఫర్ హిచెన్స్ వంటి విమర్శకులు సందేహాలు లేవనెత్తినప్పటికీ, ఎవరూ దగ్గరకు రాని అంటువ్యాధి గ్రస్తులను తన చేతులతో కౌగిలించుకుని సేదతీర్చిన ఆమె ఆచరణాత్మక కరుణ ముందు ఏ విమర్శలూ నిలవలేక పోయాయి.**

1997 సెప్టెంబర్ 5న కోల్‌కతాలో మదర్ థెరిసా తుదిశ్వాస విడిచారు. భారత ప్రభుత్వం ఆమెకు సంపూర్ణ అధికారిక లాంఛనాలతో వీడ్కోలు పలికింది. ఆమె పవిత్ర సేవలకు గుర్తింపుగా 2003 అక్టోబర్ 19న పోప్ జాన్ పాల్ 2 ఆమెను 'ధన్యురాలిగా' (బీటిఫికేషన్) ప్రకటించగా, 2016 సెప్టెంబర్ 4న పోప్ ఫ్రాన్సిస్ వాటికన్ నగరంలో ఆమెకు సెయింట్ హుడ్ ప్రదానం చేసి 'కలకత్తా సెయింట్ థెరిసా'గా నామకరణం చేశారు. ఐక్యరాజ్య సమితి ఆమె వర్ధంతి రోజైన సెప్టెంబర్ 5వ తేదీని 'అంతర్జాతీయ దాతృత్వ దినోత్సవం'గా ప్రకటించి శాశ్వత గౌరవాన్ని అందించింది. "ప్రేమ అనేది మాటల్లో కాదు, చేతల్లో చూపించాలి; మనం చేసే పని ఎంత గొప్పదనేది కాదు, ఎంత ప్రేమతో చేశామన్నదే ముఖ్యం" అన్న ఆమె జీవన సందేశం, వేదం పలికిన "మానవసేవే మాధవసేవ" అనే సనాతన ధర్మానికి నిజమైన భాష్యం. భౌతికంగా ఆమె దూరమైనా, ఆపన్నుల కన్నీరు తుడిచే ప్రతి హస్తంలోనూ, ఆకలి తీర్చే ప్రతి ముద్దలోనూ, నిస్సహాయులకు నిలబడే ప్రతి సంకల్పంలోనూ మదర్ థెరిసా కరుణామయ స్ఫూర్తి కలకాలం చిరంజీవిగా వెలుగొందుతూనే ఉంటుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అసమానతలపై శాంతి సమరం

### ప్రవక్త ముహమ్మద్ సమాజ పరివర్తనం
### మదీనా రాజ్యాంగం నుంచి మానవ హక్కుల దాకా
### మహోన్నత సంస్కర్త ప్రవక్త ముహమ్మద్

**మానవ సమాజంలో నైతిక విలువలు పతనమై అంధకారం అలుముకున్నప్పుడల్లా మహనీయులు వెలుగుదివ్వెలుగా ప్రభవిస్తుంటారు. ఏడవ శతాబ్దపు అరేబియాలో అజ్ఞానం, తెగల మధ్య రక్తపాత ఘర్షణలు, బానిసత్వం, ఆడశిశువుల సజీవ ఖననం వంటి పాశవిక దురాచారాలు తాండవిస్తున్న కాలంలో ప్రవక్త ముహమ్మద్ శాంతి, కరుణ, సమతాభావాలను పాదుకొల్పారు. ఇస్లామీయ సంప్రదాయంలో చివరి ప్రవక్తగా ('ఖాతమున్నబియ్యీన్') ముస్లింలు విశ్వసించే ముహమ్మద్, సంస్కర్తగా, పాలనాదక్షుడిగా మధ్యయుగ ప్రపంచాన్ని మౌలికంగా ప్రభావితం చేశారు.**

క్రీస్తుశకం 570 ప్రాంతంలో మక్కాలో జన్మించిన ఆయన, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా పెరిగారు. యౌవనంలో ఆయన కనబరిచిన సత్యనిష్ఠ, నిష్కళంక ప్రవర్తన కారణంగా తోటి ప్రజలు ఆయనను 'అల్-అమీన్' (విశ్వసనీయుడు), 'అస్-సాదిక్' (సత్యవంతుడు) అని పిలుచుకున్నారు. నలభై ఏళ్ల వయస్సులో హిరా గుహలో ఏకాంత ధ్యానంలో ఉండగా జిబ్రాయిల్ దేవదూత ద్వారా మొట్టమొదటి దైవాదేశం అందింది. ఆపై ఆయన ప్రబోధించిన ఏకేశ్వరోపాసన, పేదలకు సహాయం, బానిసల హక్కుల వంటి విప్లవాత్మక అంశాలు పెత్తందారీ వర్గాలకు కోపం తెప్పించడంతో హింస ప్రారంభమైంది. దీంతో క్రీ.శ. 622లో ముస్లింలు మక్కా నుంచి యస్రిబ్ (మదీనా)కు వలస వెళ్లారు (హిజ్రా).

మదీనాలో ప్రవక్త ముహమ్మద్ 'మీసాఖ్-ఎ-మదీనా' (మదీనా రాజ్యాంగం) పేరిట ప్రపంచంలోనే తొలి లిఖితపూర్వక ప్రజాస్వామిక ఒప్పందాన్ని రూపొందించి, భిన్న మతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చారు. బద్ర్, ఉహుద్, ఖందక్ యుద్ధాల్లోనూ మహిళలు, పిల్లలు, వృద్ధులను హింసించకూడదనే యుద్ధ



నీతి ప్రమాణాలను అమలు చేశారు. క్రీ.శ. 630లో మక్కాను శాంతియుతంగా జయించినప్పుడు శత్రువులందరికీ సాధారణ క్షమాభిక్ష ప్రసాదించారు. తుది ప్రసంగంలో (ఖుత్బతుల్ విదా) వర్ణ, జాతి వివక్షలకు స్వస్తి పలుకుతూ మానవ హక్కులు, మహిళా సాధికారతకు ప్రాధాన్యమిచ్చారు.

మీలాద్-ఉన్-నబీ వేడుకలు కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా, ఆయన ఆచరించి చూపిన దయ, సేవాభావం, సమతాభావాలను నిత్య జీవితంలో అలవర్చుకోవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే భారతీయ సమాజంలో సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని, మతసామ-రస్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రవక్త జీవితం ఒక అఖండ స్ఫూర్తిప్రదాతగా నిలుస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# '6-7'తో వైరల్.. వికెట్ల వేటలోనూ తోపు!

- ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన 20 ఏళ్ల మేధావి బిధూరి
- 67 నంబర్ జెర్సీ.. '6-7' సెలబ్రేషన్‌తో నెట్టింట క్రేజ్
- ఇప్పుడు బంతితో మాయ.. వికెట్ల జాబితాలో అగ్రస్థానం
- చెల్లెలి ఐడియాతో చేసిన సెలబ్రేషన్‌కు దేశవ్యాప్తంగా ఆదరణ
- చాహల్ కూడా అనుకరించడంతో మరింత వైరల్



కొత్త క్రష్.. మేధావి బిధూరి..!

**న్యూఢిల్లీ:** వారం రోజుల కిందట ఆమె పేరు చాలామంది క్రికెట్ అభిమానులకు తెలియదు. ఒక్క వికెట్.. ఆ వెంటనే చేసిన వెరైటీ '6-7' సెలబ్రేషన్.. జెర్సీపై కూడా అదే '67' నంబర్! అంతే.. రాత్రికి రాత్రే సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారిపోయింది 20 ఏళ్ల యువ క్రికెటర్ మేధావి బిధూరి. ఇప్పుడు మాత్రం సెలబ్రేషన్‌తో కాదు.. బంతితో ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తూ మరోసారి వార్తల్లో నిలిచింది. మహిళల ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2026లో వరుసగా వికెట్లు పడగొడుతూ అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అగ్రస్థానానికి చేరుకుంది.

### ఎవరీ మేధావి బిధూరి?

మహిళల ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న యువ బౌలర్ మేధావి బిధూరి. వయసు కేవలం 20 ఏళ్లు. ఆట కంటే ముందుగా ఆమెను సామాజిక మాధ్యమాలకు పరిచయం చేసింది మాత్రం ఓ ప్రత్యేక సెలబ్రేషన్. ఆగస్టు 20న సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ తరఫున ఆడుతూ వికెట్ తీసిన అనంతరం మేధావి చేసిన '6-7' జెన్ జీ సెలబ్రేషన్ ఒక్కసారిగా వైరల్‌గా మారింది. దీనికి మరో ఆసక్తికర అంశం తోడైంది. ఆమె ధరించిన జెర్సీ నంబర్ కూడా '67' కావడంతో ఆ సెలబ్రేషన్ మరింతగా నెటిజన్లను ఆకట్టుకుంది. వీడియోలు, చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో మేధావి ఒక్కసారిగా టోర్నీలో అత్యంత చర్చనీయాంశమైన క్రీడాకారిణిగా మారింది.

### ఆ ఐడియా చెల్లెలిదే!

అయితే '67' జెర్సీ, '6-7' సెలబ్రేషన్ వెనుక అసలు సూత్రధారి తాను కాదని మేధావి వెల్లడించింది. ఆ ఆలోచన తన చెల్లెలిదేనని చెప్పింది. 67 నంబర్ జెర్సీ ధరించాలని, ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న '6-7' సెలబ్రేషన్ చేయాలని తన చెల్లెలే సూచించిందని వివరించింది. చెల్లెలి సరదా ఐడియా అక్కను ఓవర్‌నైట్ స్టార్‌గా మార్చేసింది.

### వైరల్ మాత్రమే కాదు.. వికెట్లలోనూ టాప్

సామాజిక మాధ్యమాల్లో వచ్చిన క్రేజ్‌తోనే మేధావి సరిపెట్టుకోలేదు. మైదానంలోనూ తన బౌలింగ్ ప్రతిభతో సత్తా చాటుతోంది. సెంట్రల్ ఢిల్లీ క్వీన్స్‌తో జరిగిన తాజా మ్యాచ్‌లో రెండు కీలక వికెట్లు పడగొట్టి సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ విజయంలో ప్రధాన పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ 68 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. స్వల్ప లక్ష్యమే కావడంతో సెంట్రల్ ఢిల్లీ క్వీన్స్ సునాయాసంగా ఛేదిస్తుందని భావించారు. కానీ మేధావి సహా సౌత్ ఢిల్లీ బౌలర్లు ప్రత్యర్థికి చుక్కలు చూపించారు. తానిషా సింగ్ సహా ఇద్దరిని మేధావి పెవిలియన్‌కు పంపింది. చివరకు సెంట్రల్ ఢిల్లీ క్వీన్స్ 57 పరుగులకే పరిమితం కావడంతో సౌత్ ఢిల్లీ 10 పరుగుల తేడాతో విజయం సాధించింది.

### నాలుగు వికెట్లు.. అగ్రస్థానం

ఈ రెండు వికెట్లతో టోర్నీలో మేధావి వికెట్ల సంఖ్య నాలుగుకు చేరింది. తద్వారా మహిళల ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2026లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అగ్రస్థానంలో నిలిచింది. '6-7' సెలబ్రేషన్‌తో వచ్చిన గుర్తింపు తాత్కాలికం కాదని.. తన అసలు గుర్తింపు బౌలింగ్ ద్వారానే వస్తుందని ప్రదర్శనతో నిరూపిస్తోంది.

### చాహల్‌నూ ఆకట్టుకున్న '6-7'

మేధావి సెలబ్రేషన్ ఎంతగా వైరల్ అయిందంటే.. భారత స్టార్ లెగ్‌స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ సైతం దానిని అనుకరించాడు. ఇంగ్లాండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడుతున్న చాహల్ '6-7' సెలబ్రేషన్‌ను రీక్రియేట్ చేయడంతో మేధావి పేరు మరింతగా మార్మోగింది. నిన్నటి వరకు '6-7 అమ్మాయి'గా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన మేధావి బిధూరి.. ఇప్పుడు 'వికెట్ల వేటగత్తె'గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. వైరల్ సెలబ్రేషన్‌తో అభిమానులను ఆకట్టుకుని.. బంతితో ప్రత్యర్థులను కట్టడి చేస్తున్న ఈ 20 ఏళ్ల యువ బౌలర్.. మహిళల ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది.

# మేం బాగా బౌలింగ్ చేస్తే సరిపోదు!

- స్లిప్‌లో క్యాచ్‌లు పట్టడం కూడా అంతే ముఖ్యం: ప్రసిద్ధ్ కృష్ణ
- శ్రీలంకను దెబ్బకొట్టిన భారత పేసర్
- మూడు కీలక వికెట్లతో ప్రత్యర్థిపై ఒత్తిడి
- 'దూకుడంటే మాటల్లో కాదు.. నా బంతుల్లో కనిపిస్తుంది'
- పిచ్‌ను బట్టే లెంగ్త్ మార్చుకుంటానని వెల్లడి

**కొలంబో:** బౌలర్ ఎంత అద్భుతంగా బంతులు వేసినా.. ఎడ్జ్ తీసుకున్న బంతిని స్లిప్‌లో ఫీల్డర్ అందుకోకపోతే ఆ శ్రమకు ఫలితం ఉండదని భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ అన్నాడు. శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మూడు కీలక వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టిన ప్రసిద్ధ్.. తన బౌలింగ్ వ్యూహంతో పాటు ఫీల్డింగ్ ప్రాధాన్యాన్ని వివరించాడు. చిన్న చిన్న విషయాలను సరిగ్గా అమలు చేయడమే మ్యాచ్‌లో విజయానికి బాటలు వేస్తుందని చెప్పాడు. కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో భారత్ ఆధిపత్యం కొనసాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 503 పరుగులకు తొమ్మిది వికెట్ల వద్ద డిక్లేర్ చేసింది. మూడో రోజు రెండో సెషన్ సమయానికి శ్రీలంక ఏడు వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసి ఇంకా 322 పరుగులు వెనుకబడి ఉంది. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ మూడు కీలక వికెట్లు పడగొట్టి లంక బ్యాటింగ్ శ్రేణిని దెబ్బతీశాడు.

### బౌలర్ పని అక్కడితో అయిపోదు

శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉదారాను ఔట్ చేసిన విధానాన్ని ప్రసిద్ధ్ ప్రత్యేకంగా ప్రస్తావించాడు. తాను వేసిన బంతి పిచ్‌పై కొద్దిగా ఆగి స్వల్పంగా సీమ్ కావడంతో బ్యాట్ అంచును తాకిందని చెప్పాడు. స్లిప్‌లో ఉన్న యశస్వి జైస్వాల్ అద్భుతంగా క్యాచ్ అందుకున్నాడని ప్రశంసించాడు. "బంతి బ్యాట్ అంచును తాకేలా సరైన ప్రదేశంలో వేయడం బౌలర్ బాధ్యత. కానీ వచ్చిన అవకాశాన్ని స్లిప్ ఫీల్డర్ క్యాచ్‌గా మలచడం కూడా అంతే ముఖ్యం. సాధన సమయంలో ఫీల్డింగ్‌పై మా జట్టు ఎంతో శ్రమిస్తోంది. జైస్వాల్ క్యాచ్ అందుకు లభించిన ఫలితమే" అని ప్రసిద్ధ్ పేర్కొన్నాడు. మ్యాచ్‌ల్లో పెద్ద పెద్ద వ్యూహాల కంటే చిన్న విషయాలను పక్కాగా అమలు చేయడం కీలకమని చెప్పాడు. బౌలర్లు సృష్టించిన అవకాశాలను ఫీల్డర్లు సద్వినియోగం చేసుకుంటేనే ప్రత్యర్థిపై పూర్తి స్థాయిలో ఒత్తిడి తీసుకురాగలమని అభిప్రాయపడ్డాడు.

### 'నా దూకుడు బంతుల్లో కనిపిస్తుంది'

తన బౌలింగ్‌లో దూకుడుకు అత్యధిక ప్రాధాన్యం ఉంటుందని ప్రసిద్ధ్ తెలిపాడు. అయితే దూకుడంటే ప్రత్యర్థితో మాటల యుద్ధానికి దిగడం లేదా శరీర భాషలో ఆవేశాన్ని ప్రదర్శించడం మాత్రమే కాదన్నాడు. "నా దూకుడు నేను వేసే బంతుల్లో కనిపిస్తుంది. పిచ్ నుంచి ఏమాత్రం సహకారం లభించకపోయినా బౌలర్ దృష్టి మారకూడదు. బంతిని ఎక్కడ వేయాలనుకున్నామో అక్కడే వేయడంపై దృష్టి పెట్టాలి. పూర్తి శ్రమతో అనుకున్న ప్రదేశాల్లో బౌలింగ్ చేయడమే నా లక్ష్యం" అని వివరించాడు.

### ఒకే లెంగ్త్‌కు కట్టుబడను

తాను ఒకే లెంగ్త్‌లో బంతులు వేసే బౌలర్‌ను కాదని ప్రసిద్ధ్ స్పష్టం చేశాడు. పిచ్ స్వభావం, ప్రత్యర్థి బ్యాటర్, మ్యాచ్ పరిస్థితులను బట్టి లెంగ్త్‌లో మార్పులు చేసుకుంటానని తెలిపాడు. ఇందుకోసం జట్టు విశ్లేషకులు, కోచ్‌లతో చర్చించి ఏ లెంగ్త్‌లో బౌలింగ్ చేస్తే ఫలితం ఉంటుందో నిర్ణయించుకుంటామని చెప్పాడు. దేశానికి ప్రాతినిధ్యం వహించక ముందు తనకంటూ సహజమైన బౌలింగ్ లెంగ్త్ ఉండేదని ప్రసిద్ధ్ గుర్తుచేసుకున్నాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చిన తర్వాత వ్యక్తిగత సౌకర్యం కంటే జట్టు అవసరాలే ముఖ్యమని తెలుసుకున్నట్లు తెలిపాడు. జట్టుకు అవసరమైనప్పుడు ఏ లెంగ్త్‌లోనైనా సమర్థంగా బౌలింగ్ చేయడం నేర్చుకోవాల్సిందేనని పేర్కొన్నాడు. శ్రీలంకను తొలి ఇన్నింగ్స్‌లో కట్టడి చేసే దిశగా భారత్ దూసుకెళ్తున్న వేళ మూడు వికెట్లతో సత్తా చాటిన ప్రసిద్ధ్ కృష్ణ.. బౌలింగ్‌తో పాటు స్లిప్ ఫీల్డింగ్ కూడా విజయానికి కీలకమంటూ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.







# భారత షట్లర్ల దూకుడు

### చరిత్రాత్మక కాంస్యంతో 12 ర్యాంకులు పైకి..!

**ఢిల్లీ :** భారత మహిళా షట్లర్లు గాయత్రి గోపిచంద్, త్రీసా జాలీడబుల్స్ ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్లారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ లో పతకంతో మెరిసిన ఈ జంట ఏకంగా 12 స్థానాలు ఎగబాకింది. ఈ మెగా టోర్నమెంట్‌లో సంచలన విజయాలతో కాంస్యం గెలవడం ద్వారా 27వ స్థానం సాధించిందీ గాయత్రి- త్రిసా జోడీ. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ మహిళల డబుల్స్‌లో చరిత్రాత్మక కాంస్యం గెలుపొందిన గాయత్రి గోపిచంద్, త్రీసా జాలీ ద్వయం ర్యాంకిగ్స్‌లో సత్తా చాటింది. టాప్ సీడ్లకు షాకిచ్చి కంచు మోత మోగించిన ఈ జంట.. 27వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఈ టోర్నీ ఆరంభానికి ముందు 39వ ర్యాంక్‌లో ఉన్న గాయత్రి- త్రిసా జోడీ.. ఏకంగా 12 స్థానాలు మెరుగుపరచుకుంది. సెమీ ఫైనల్లో ఓడినా యావత్ దేశం గర్వపడే పతకం అందించిందీ గాయత్రి గోపిచంద్, త్రీసా జాలీ జంట. అశ్విని పొన్నప్ప, గుత్తా జ్వాల అనంతరం.. మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం చేసిన రెండో జోడీగా వీరు రికార్డు నెలకొల్పారు. 2011లో జ్వాల, అశ్వినిలు ఇదే ఈవెంట్‌లో కాంస్యం కొల్లగొట్టారు.




# కార్ల్‌సన్‌ను ఓడించిన 15 ఏళ్ల కుర్రాడు..

### 50 ఎత్తుల్లోనే అద్భుత విజయం!

**ఢిల్లీ :** చదరంగంలో భారత కుర్రాళ్లు అసమాన విజయాలతో దూసుకెళ్తున్నారు. గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేశ్, అర్జున్ ఎరిగేసి వంటి వారు ఇప్పటికే తామేంటో నిరూపించుకోగా.. 15 ఏళ్ల వందన్ అలంకార్ సవాయ్ వీరి సరసన చేరాడు. అలాఅనీ అతడేమీ తాజాగా ఏ టోర్నీలోనో విజేతగా నిలవలేదు. కానీ.. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి వార్తల్లో నిలిచాడీ యువ సంచలనం. పదిహేనేళ్ల భారత కుర్రాడి చేతిలో వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ కంగుతిన్నాడు. కేవలం 50 ఎత్తుల్లోనే చెస్ దిగ్గజాన్ని చిత్తు చేశాడు వందన్ అలంకార్ సవాయ్ అనే పిల్లాడు. అయితే..ఇంతటి గొప్ప విషయాన్ని అతడు తన తల్లిదండ్రులకు కూడా చెప్పలేదు. చివరకు వాళ్లే తమ కుమారుడు కార్ల్‌సన్‌ను ఓడించిన విషయం తెలిసి ఉప్పొంగిపోయారు. చెస్.కామ్(జష్ట్రవం.ఒశీఎ)వీక్లీ టైటిల్డ్ మంగళవారం ఈవెంట్లో.. ఈఎల్‌వో రేటింగ్ 2,288 ఉన్న వందన.. లెజెండరీ ఆటగాడైన కార్ల్‌సన్‌పై పైచేయి సాధించి ఔరా అనిపించాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన వందన్.. అత్యుత్తమ ఆటగాడైన కార్ల్‌సన్ పొరపాటు చేయడంతో తాను షాకయ్యానని చెప్పాడు. అంతర్జాతీయ స్థాయిలో మాస్టర్‌గా అవతరించడమే నా లక్ష్యం. ఇప్పటికే నా వయసు వారు గ్రాండ్‌మాస్టర్లు అయ్యారు. నేను కూడా ఏదో ఒకరోజు ఆ హోదా అందుకుంటా. అప్పటివరకూ నేను చరిత్ర, రాజనీతి శాస్త్రంపై దృష్టి సారిస్తాను అని వందన్ పేర్కొన్నాడు.



# రాఖీకి డ్రెస్‌తో లింకేంటి?

## కృతి సనన్ రక్షాబంధన్ ప్రకటనపై సోషల్ మీడియాలో దుమారం

## 'బికినీలో సోదరుడికి రాఖీ ఎందుకు?' అంటూ కంగనా ఘాటు వ్యాఖ్యలు



రాఖీ ప్రకటన చుట్టూ మొదలైన వివాదం బాలీవుడ్‌లో మాటల యుద్ధంగా మారింది. నటి కృతి సనన్ నటించిన రక్షాబంధన్ ప్రకటనపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ జరుగుతుండగా.. బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ చేసిన ఘాటు వ్యాఖ్యలు దుమారాన్ని మరింత పెంచాయి. తాజాగా విమర్శలకు కృతి కూడా స్పందిస్తూ.. పండుగల పట్ల గౌరవాన్ని మహిళ ధరించే దుస్తులతో కొలవడం సరికాదని తేల్చిచెప్పింది. ప్రముఖ ఆభరణాల సంస్థ కోసం రూపొందించిన రక్షాబంధన్ ప్రకటనలో కృతి సనన్ సంప్రదాయ దుస్తులకు భిన్నమైన వస్త్రధారణలో కనిపించడం కొందరి అభ్యంతరాలకు కారణమైంది. భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా భావించే రక్షాబంధన్‌ను ఇలాంటి వస్త్రధారణతో చూపించడం ఏమిటంటూ కొందరు నెటిజన్లు ప్రశ్నించారు. అదే ప్రకటనలో కృతి ఓ కుక్కకు రాఖీ కట్టే సన్నివేశంపైనా విమర్శలు వచ్చాయి. సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీని కుక్కకు కట్టడమేంటంటూ మరికొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు.

**కుక్కకు రాఖీ కట్టడంపైనా నెటిజన్ల అభ్యంతరాలు**

**'పండుగ సారం దుస్తుల్లో కాదు.. భావోద్వేగాల్లో' అంటూ కృతి కౌంటర్**

**'మహిళలు ఏం ధరించాలో చెప్పడం ఇంకెప్పుడు ఆపుతారు?' అని ప్రశ్న**



### 'మరో డ్రెస్ దొరకలేదా?'

వివాదంపై కంగనా రనౌత్ స్పందించడంతో విషయం మరింత వేడెక్కింది. కృతి పేరును నేరుగా ప్రస్తావించకపోయినా ఆమె నటించిన ప్రకటనను ఉద్దేశించే వ్యాఖ్యలు చేస్తున్నట్లు కంగనా స్పష్టం చేశారు. మహిళలకు ఇప్పుడు చీరలు, లెహంగాలు, జీన్స్, సల్వార్ కమీజ్ నుంచి బికినీల వరకు ఎన్నో రకాల దుస్తులు ధరించే స్వేచ్ఛ ఉందని పేర్కొన్నారు. అయితే సోదరుడికి రాఖీ కట్టే సందర్భంలో అలాంటి వస్త్రధారణ ఎందుకని కంగనా ప్రశ్నించారు. ప్రకటనకు పనిచేసిన స్టైలిస్ట్‌కు మరో దుస్తులు దొరకలేదా అంటూ వ్యాఖ్యానించారు. ఆ ప్రకటన తనకు అసహ్యంగా అనిపించిందంటూ తీవ్రంగా విమర్శించారు.

### 'పండుగ సారం దుస్తుల్లో ఉండదు'

తనపై వస్తున్న విమర్శలపై కృతి సనన్ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించారు. పండుగల సారం మనం ధరించే దుస్తుల్లో ఉండదని, సంప్రదాయాల పట్ల మనకున్న భావోద్వేగాలు, అనుబంధంలో ఉంటుందని పేర్కొన్నారు. రక్షాబంధన్ అంటే కేవలం సోదరుడు సోదరిని రక్షించడమే కాదని, పరస్పరం ఒకరికొకరు అండగా నిలిచే బంధమని వివరించారు. తాను, తన సోదరి ఒకరికొకరు రాఖీ కట్టుకుంటామని కృతి తెలిపారు. ఒకరి ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయువు కోసం మరొకరు ప్రార్థించుకుంటామని చెప్పారు. తమ ఇంట్లో పెంపుడు కుక్కలను కూడా కుటుంబ సభ్యులుగానే చూస్తామని, అందుకే వాటినీ ఈ వేడుకలో భాగం చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు.

### 'మహిళల దుస్తులపై తీర్పులెందుకు?'

మహిళలు ఏం ధరించాలో సమాజం చెప్పడం ఇంకెప్పుడు ఆపుతుందని కృతి ప్రశ్నించారు. ఒక మహిళకు తన సంస్కృతి, సంప్రదాయాలపై ఎంత గౌరవం ఉందన్న విషయాన్ని ఆమె ధరించిన దుస్తులను చూసి నిర్ణయించడం సరికాదన్నారు. కాలంతోపాటు సంప్రదాయ వస్త్రధారణలోనూ ఎన్నో మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. సంస్కృతి, సంప్రదాయాల పట్ల మహిళకున్న గౌరవం ఆమె హృదయంలో ఉంటుందని, ఆమె ధరించే దుస్తుల్లో కాదన్న భావనను కృతి వ్యక్తం చేశారు. దీంతో రక్షాబంధన్ ప్రకటనపై మొదలైన వివాదం ఇప్పుడు 'పండుగ సంప్రదాయం--వ్యక్తిగత వస్త్రధారణ స్వేచ్ఛ' అనే చర్చగా మారింది. ఒకవైపు పండుగలను వాటి సంప్రదాయ రూపంలోనే చూపించాలని వాదిస్తున్నవారు కంగనా వ్యాఖ్యలకు మద్దతు పలుకుతుండగా.. మరోవైపు వస్త్రధారణ వ్యక్తిగత స్వేచ్ఛ అని, పెంపుడు జంతువులను కుటుంబంలో భాగంగా చూడటంలో తప్పులేదని కృతికి మద్దతుగా మరికొందరు స్పందిస్తున్నారు. దీంతో ఒక్క రాఖీ ప్రకటన బాలీవుడ్‌లోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ పెద్ద చర్చకు తెరతీసింది.




# నేడు టాక్సిక్ విడుదల

## టిక్కెట్ రేట్ల పెంపునకు తెలంగాణలో అనుమతి

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్' ఆగస్టు 26 ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు హోమ్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సింగిల్ స్క్రీన్ థియేటర్లలో జీఎస్టీతో కలుపుకుని రూ. 50, అలాగే మల్టీప్లెక్స్‌లు మరియు స్పెషల్ థియేటర్లలో రూ. 100 వరకు అదనంగా టికెట్ ధరలను పెంచుకోవడానికి అనుమతిని ఇచ్చారు. పెంచిన ధరలు సినిమా విడుదలైన రోజు నుంచి సెప్టెంబర్ 4 వరకు పది రోజుల పాటు అమలులో ఉంటాయి. అలాగే ఈ పది రోజుల పాటు రోజుకు అదనంగా ఒక షోతో కలుపుకుని మొత్తం 5 షోలు ప్రదర్శించుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ధరల పెంపుతో పాటు మరికొన్ని కీలక నిబంధనలను కూడా ఖరారు చేసింది. సినీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అకౌంట్‌కు నిర్మాణ సంస్థ 'కేవీఎన్-మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ ఎల్ఎల్‌పీ' తక్షణమే రూ. 1 కోటి విరాళంగా అందించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిధులను పూర్తిగా సినీ కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే ఖర్చు చేయనున్నారు. అలాగే, సినిమా ప్రదర్శన సమయంలో మాదకద్రవ్యాలు, నార్కోటిక్స్ మరియు సైబర్ క్రైమ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించే ప్రత్యేక ప్రకటనలను తప్పనిసరిగా ప్రదర్శించాలని థియేటర్ల యాజమాన్యాలను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిబంధనలన్నీ ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించే బాధ్యతను జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు మరియు సినిమా లైసెన్సింగ్ అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శిఖా గోయల్ ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. టాక్సిక్' చిత్రాన్ని తెలంగాణలో ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు, ఎఫ్.డి.సి. ఛైర్మన్ దిల్ రాజు విడుదల చేస్తున్నారు.



# తెలుగులో 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్'

మలయాళ సినీ పరిశ్రమలో సంచలన విజయాలను నమోదు చేస్తూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సరికొత్త ఫీల్-గుడ్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'బెత్లెహెమ్ కుడుంబ యూనిట్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. 'బెత్లెహెమ్ కుటుంబ యూనిట్' అనే పేరుతో రాబోతున్న ఈ సినిమాను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఘనంగా విడుదల చేయబోతుంది. యువ కథానాయకుడు నివిన్ పౌలి హీరోగా, సెన్సేషనల్ నటి మమితా బైజు నాయికగా నటించిన ఈ చిత్రానికి గిరీష్ ఎ.డి. దర్శకత్వం వహించారు. కేరళలో ఓణం కానుకగా విడుదలైన ఈ సినిమా అంచనాలకు మించి భారీ వసూళ్లను రాబట్టడమే కాకుండా, ప్రేక్షకుల నుంచి ప్రశంసల వర్షాన్ని అందుకుంది. ముఖ్యంగా నివిన్ పౌలి నటన మరియు మమితా బైజుతో ఆయన ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఎంతగానో కట్టుపడేసింది. ఇక 'ప్రేమలు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు అత్యంత దగ్గరైన మమితా బైజు నటిస్తున్న మరో చిత్రం కావడంతో టాలీవుడ్‌లోనూ ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. భావనా స్టూడియోస్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని ఫ్యూచర్ రన్-అప్ సహకారంతో మైత్రీ రిలీజ్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదల కానుంది. మలయాళంలో తిరుగులేని విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులను కూడా కచ్చితంగా అలరిస్తుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.







# దేశ విభజన నేపథ్యంలో బట్వారా 1947

## పేలవ ప్రదర్శనతో ఆకట్టులోకపోయిన చిత్రం

సన్నీ డియోల్ హీరోగా దేశ విభజన గాథ నేపథ్యంలో ఆమిర్ ఖాన్ నిర్మించిన 'బట్వారా 1947' చిత్రం ఆగస్ట్ 14న విడుదలైంది. ఈ సినిమా బాక్సాఫీస్ బరిలో చాలా పేలవమైన ప్రభావాన్ని చూపించింది. దీనికి ముందు ఇదే తరహాలో వచ్చిన 'మై వాపస్ ఆవుంగా' దీనికంటే బెటర్ గా పెర్ఫార్మ్ చేసిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'బట్వారా' చిత్రంతో ఆమిర్ ఖాన్‌కు దాదాపు 90 కోట్ల నష్టం వచ్చిందని అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పుడీ సినిమా ఓటీటీ డీల్ సందిగ్ధంలో పడింది. నిజానికి సినిమా రిలీజ్ కు ముందు ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ రూ. 125 కోట్లను ఆఫర్ చేసిందట. కానీ అప్పుడు అందుకు ఆమిర్ ఖాన్ అంగీకరించలేదని తెలిసింది. ఇప్పుడు సినిమా విడుదలై పరాజయం పాలు కావడంతో ఏ ఓటీటీ ప్లాట్ ఫామ్ కూడా దీని హక్కులపై ఆసక్తి చూపడం లేదట. 'బట్వారా' సినిమా విడుదలకు ముందే ఓటీటీ డీల్ కుదర్చుకోమని, ఆ కారణంగా ఆర్థికంగా ఉపయోగపడుతుందని ఆమిర్‌కు సన్నీడియోల్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఆయన దానిని ఖండించారు. తమ మధ్య ఓటీటీ డీల్‌కు సంబంధించి ఎలాంటి చర్చ జరగలేదని ఆయన అన్నారు. 'బట్వారా' సినిమా విషయంలో తాను గర్వం పడుతుంటానని, బాక్సాఫీస్ ఫలితాలు సినిమా క్వాలిటీని ప్రతిఫలించవని ఆయన తెలిపారు. తన తండ్రి కెరీర్ లో హృషికేశ్ ముఖర్జీ తీసిన 'సత్యకామ్' ఉత్తమ చిత్రంగా తాను భావిస్తానని, కాని ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ పరాజయాన్ని చవిచూసిందని సన్నీ డియోల్ చెప్పారు. అయితే 'బట్వారా' నష్టాలు రాబోయే రోజుల్లో భర్తీ అవుతాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com